www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 28 | నవంబర్ | 2025
పేజీలు : 8

## నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు



-నిబంధనల ప్రకారం ఎన్నికల విధులు నిర్వహించాలి
-నామినేషన్ స్వీకరణ ప్రక్రియను తనిఖీ చేసిన కలెక్టర్

2లో..

# తప్పని తిప్పలు..!





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఆ ఆదివాసీల బ్రతుకులకు తిప్పలు తప్పడం లేదు. సాంకేతిక పరిజ్ఞానం వినీలాకాశాన్ని చీల్చుకు పోతున్నా... అంతరిక్షం కొత్త పుంతలు తొక్కుతున్నా ఆ ఆదివాసీ బ్రతుకుల్లో మాత్రం కాంతిరేఖలు నిండటం లేదు. దశాబ్ధాలుగా అవే కష్టాలు పడుతూ నరక యాతన అనుభవిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పినపాక నియోజకవర్గ పరిధిలో గల బూర్గంపాడు మండలం మోతే పట్టీనగర్ పంచాయితీ చింతకుంట గిరిజన గ్రామంలో ఆదివాసీ తెగకు చెందిన 35 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఆ గ్రామం నేటికీ కనీస మౌళిక సదుపాయాలకు నోచుకోలేదు. మిగతా 2లో..

- కనీస మౌలిక సదుపాయాలకు ఆమడదూరం
- పురుడు పోసుకోవాలంటే అష్టకష్టాలు
- ఓటర్, రేషన్, ఆధార్ కార్డులున్నా అదే పరిస్థితి
- విద్యుత్ సదుపాయాన్ని అడ్డుకుంటున్న అటవీశాఖ
- కాలం మారుతున్న తలరాతలు మారవాయే
- దయ చూపాలంటూ ఆదివాసీల వేడుకోలు

## ప్రారంభమైన
# నామినేషన్ల ఘట్టం

-కొనసాగుతున్న చర్చలు
-పలు చోట్ల అభ్యర్థుల ప్రకటన.. పలువురి నామినేషన్
-నూతన బ్యాంక్ ఖాతా తప్పనిసరి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** పంచాయతీ ఎన్నికల తొలి దశకు సంబంధించి గురువారం నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి దశలో ఏడు మండలాల పరిధిలోని 192 గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు 1740 వార్డులకు నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. పలువురు అభ్యర్థులు తమ మద్దతుదారులతో వచ్చి మిగతా 2లో..

# నిబద్ధత గల కమ్యూనిస్టు పోటు ప్రసాద్




ఖమ్మంలో...

- ఆశయాన్ని ఆచరణలో చూపిన మహోన్నతుడు
-వర్థంతి సభలో బాగం



కొత్తగూడెంలో...

లోపలి పేజీల్లో



పాల్వంచలో...

**ప్రజాపక్షం/ ఖమ్మం :** నిబద్ధత గల కమ్యూనిస్టు పోటు ప్రసాద్ అని తుది శ్వాస వరకు పార్టీ విస్తరణ కోసం, పేదల అభ్యున్నతి కోసం కృషి చేశారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ఆయన నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరణలో చూపిన మహోన్నతుడు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుడు, సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి పోటు ప్రసాద్ ప్రథమ వర్థంతి సభ గురువారం సిపిఐ కార్యాలయంలో జరిగింది. ఎస్‌కె జానిమియా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హేమంతరావు మాట్లాడుతూ సాయుధ పోరాట వారోత్స కుటుంబంలో జన్మించిన పోటు ప్రసాద్ తుది శ్వాస వరకు అదే పంథాను కొనసాగించారన్నారు. విద్యార్థి దశలో విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం ముఖ్యంగా ఖమ్మంలో పిజి కళాశాల సాధన కోసం జరిగిన విద్యార్థి ఉద్యమంలో పోటు ప్రసాద్ క్రియాశీలక భూమిక పోషించారని ఆయన తెలిపారు. కార్మిక సంఘ నాయకునిగా పని చేసిన పోటు ప్రసాద్ సంఘటిత, అసంఘటిత రంగాలలో బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించారన్నారు. సుదీర్ఘ కాలం కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేసిన ప్రసాద్ ఎటువంటి విమర్శకు తావివ్వలేదని ఆయన తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శిగా జిల్లాలో పార్టీ మిగతా 2లో..

# తప్పని తిప్పలు..!

(మొదటిపేజీ తరువాయి)

కనీసం గ్రామానికి ఎలాంటి రహదారి సౌకర్యం లేదు. వర్షాకాలం వచ్చిందంటే ఆ గ్రామ ప్రజలు పడుతున్న వ్యధలు అన్నీ ఇన్నీ కావు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బ్రతుకు జీవుడా అంటా ఉండాల్సిందే. మరో విషయం ఏమిటంటే ఆ గ్రామప్రజలకు కనీసం విద్యుత్ వెలుగులు అంటే ఏమిటో కూడా తెలియదంటే అతిశయోక్తి కాదు. జిల్లాలో కేటిపిఎస్,బిటిపిఎస్ వంటి విద్యుత్ ఉత్పత్తి కంపెనీలు ఉన్నప్పటికీ ఆ గ్రామానికి విద్యుత్ సదుపాయాన్ని కల్పించక పోవడం శోచనీయం. ఎవరోవస్తారు. ఏదో చేస్తారని ఆ గ్రామ ప్రజలకు ఎదురు చూడటమే ఆనవాయితీగా మారింది.

**పురుడుపోసుకోవాలంటే తప్పని తిప్పలు...**

ఆ గ్రామంలో బాలింతలు పడే బాధలు వర్ణణాతీతం. పురుడు పోసుకోవాలంటే మరోజన్మ ఎత్తాల్సిందే. గర్భిణీలను కనీసం మూడు కిలోమీటర్ల వరకు మంచంపై డోలీకట్టి రోడ్డుకు తీసుకొస్తే గానీ ఆస్పత్రికి చేరే అవకాశం ఉండదు. తల్లి కాబోతున్న సంతోషంలో ఉండే ఆ గర్భిణీ పురుటి నొప్పులను సైతం పంటి బిగువన నొక్కిపట్టి కాన్పు కోసం పడరాని కష్టాలు పడాల్సి వస్తోంది. ఈ ఈ నెల 17వ తేదిన ఓ బాలింతను డోలీపై తరలించే క్రమంలో మార్గమధ్యలోనే ప్రసవించింది. రోడ్డు సమీపానికి వైద్య సిబ్బంది రావడంతో తల్లిబిడ్డ క్షేమంగా బయటపడ్డారు. ఈ దయనీయ పరిస్థితులు పినపాక నియోజకవర్గంలో రాజ్యమేలుతుంటే పాలకులు పట్టించుకోవడం లేదని ఆ గ్రామానికి చెందిన ఆదివాసీలు, హక్కుల సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**విద్యుత్ ఏర్పాటును అడ్డుకుంటున్న అటవీశాఖ...**

అటవీ అధికారులు ఆ గ్రామంలో విద్యుత్ ఏర్పాటు చేసేందుకు కొర్రీలు పెడుతున్నారు. చింతకుంట గ్రామ ఆదివాసీలు అటవీ చట్టాలకు వ్యతిరేకంగా నివాసం ఉంటున్నారని, ఆ గ్రామంలో విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేయడం కుదరదని అంటున్నట్లు తెలిసింది. తమకు విద్యుత్ వెలుగులు నింపాలని ప్రభుత్వం భావించినప్పటికీ అటవీ అడ్డంకులతో ఆగిపోయింది. ఈ మధ్యకాలంలో కేవలం ఒక్క స్తంబాన్ని వేసి చేతులు దులుపుకున్నారు.

**ఓట్ల కోసం వస్తారే తప్ప...**

ఆ గ్రామంలో సుమారు 35 ఆదివాసీ కుటుంబాలు ఎంతో కాలంగా జీవనం సాగిస్తున్నాయి. ఆ గ్రామంలోని అన్ని కుటుంబాలకు ఓటర్ ఐడి,రేషన్,ఆధార్ కార్డులు ఉన్నాయి. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చే వారే తప్ప తమ పాట్లను పట్టించుకునే నాధుడే లేదని వా పోతున్నారు. ఇదిలా ఉండగా గర్భిణీలకు పౌష్టికాహారం అందించేందుకు అంగన్‌వాడీ కూడా లేదు. ఆ గ్రామంలోని పిల్లలు అక్షరాలు నేర్వాలంటే కిలోమీటర్ల కొద్దీ బడికి నడిచి రావాల్సిన దుస్థితి ఉంది. సమీపానే ఐటిడిఏ ఉన్నప్పటికీ ఆ ఆదివాసీలకు కనీసం మేలు చేయడంలేని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆ గ్రామంపై దృష్టి సారించాలని, స్థానిక ఎన్నికల సందర్భంగా అయినా తమ బ్రతుకులకు మేలు చేయాలని ఆదివాసీ ప్రజలు వేడుకుంటున్నారు.

# నిబద్ధత గల కమ్యూనిస్టు పోటు ప్రసాద్









(మొదటిపేజీ తరువాయి)

శాఖల పునర్ నిర్మాణంపై దృష్టిసారించి సఫలీకృతడయ్యారన్నారు. నాయనమ్మ యర్రమ్మ, తండ్రి రాఘవయ్య వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న పోటు ప్రసాద్ స్పష్టమైన రాజకీయ సైద్ధాంతిక అవగాహన కలిగి ఉండడంతో పాటు సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకు పోవడం లోనూ ఆయన సఫలీకృతుడయ్యారని హేమంతరావు తెలిపారు. ఒక సంక్లిష్ట పరిస్థితుల్లో పోటు ప్రసాద్ వర్ధంతి సభను జరుపుకుంటున్నామని ఒక పక్క కమ్యూనిస్టు పార్టీ శత వసంత సంబురాలు ఖమ్మంలో జరగబోతున్నాయని ఈ సమయంలో పోటు ప్రసాద్ లేని లోటు అడుగడుగునా కనిపిస్తుందన్నారు. జాతీయ మహాసభలను ఖమ్మంలో నిర్వహించాలని తలపెట్టిన ఆలోచన పరుడు ప్రసాద్ అని ఆయన వర్ధంతి సందర్బంగా ప్రసాద్ ఆలోచనలను, ఆశయాలను ప్రజల్లోకి తీసుకు పోవడమే మనం ఆయనకు ఇచ్చే సరైన నివాళి అన్నారు. అభ్యుదయవాదిగా, నికార్సయిన కమ్యూనిస్టుగా జీవించిన ప్రసాద్ కమ్యూనిస్టు ఉద్యమం ఉన్నంత కాలం చిరస్థాయిగా నిలిచి ఉంటారని హేమంతరావు తెలిపారు. అంతకు ముందు పోటు ప్రసాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వర్ధంతి సభలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, బిజి క్లెమెంట్, మహ్మద్ సలాం, పోటు ప్రసాద్ తనయుడు సాత్విక్, సతీమణి నిర్మల, సోదరి పోటు కళావతి తదితరులు పాల్గొన్నారు.

**40వ డివిజన్‌లో...**

సిపిఐ నాయకుడు పోటు ప్రసాద్ ప్రథమ వర్ధంతి సభను 40వ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన స్మారక స్తూపం వద్ద పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బిజి క్లెమెంట్ అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ 40వ డివిజన్‌లో పార్టీ శాఖ ఏర్పాటుకు పోటు ప్రసాద్ విశేష కృషి చేశారని ఆయన సమక్షంలో అనేక మంది సిపిఐలో చేరిన కొద్ది రోజులకే ప్రసాద్ మరణించడం అత్యంత బాధాకరమన్నారు. అట్టడుగు వర్గాలకు దన్నుగా నిలిచే ప్రసాద్ మృతి కమ్యూనిస్టు పార్టీ ఉద్యమానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, పోటు కళావతి, తోట రామాంజనేయులు, గాదె లక్ష్మినారాయణ, పోటు పూర్ణ, వరదా నర్సింహారావు, పోటు నిర్మల, పలువురు సిపిఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరా నగర్ పైలాన్ వద్ద...**

ఇందిరా నగర్ పైలాన్ వద్ద పోటు ప్రసాద్ ప్రథమ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పోటు ప్రసాద్ స్మారక స్తూపానికి సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, పోటు ప్రసాద్ తనయుడు సాత్విక్ పోటు ప్రసాద్ స్మారక స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని సిపిఐ నాయకులు ప్రారంభించారు. వందలాది మంది ఈ కార్యక్రమంలో పాల్గొని పోటు ప్రసాద్‌కు నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, నాయకులు ఎస్‌కె జానిమియా, ఏపూరి లతాదేవి, పోటు కళావతి, పోటు నిర్మల, తాటి వెంకటేశ్వరరావు, పగడాల మల్లేష్, ఏనుగు గాంధీ, వరదా నర్సింహారావు, బండారుపల్లి నవీన్, సత్యనారాయణరెడ్డి, వెంకన్న, నాగేశ్వరరావు, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, ఆముదాల వెంకన్న, జాకీర్, తాటి నిర్మల, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోటు ప్రసాద్ ప్రథమ వర్ధంతి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సిపిఐ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు. ఖమ్మం జిల్లా మాజీ కార్యదర్శి పోటు ప్రసాద్ ప్రథమ వర్ధంతి సిపిఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో పోటు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థి,యువజన, కార్మిక రంగాల్లో సుదీర్ఘకాలం పనిచేసిన పోటు ప్రసాద్ అనేక పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు. సమస్యల పరిష్కారం ఆయన నిరంతరం శ్రమించారని అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, ఖమ్మం జిల్లా కార్యదర్శిగా సేవలందించి పార్టీ విస్తరణకు కృషి చేశారని, తన తుదిశ్వాస వరకు కష్ట జీవుల విముక్తి కోసం పనిచేశారని కొనియాడారు. కమ్యూనిస్టు నేతగా నిబద్ధత గల నాయకునిగా అనేక పలువురుకి ఆదర్శప్రాయుడని చెప్పారు. పోటు ఆశాయల సాధన కోసం కమ్యూనిస్టులంతా పునరాంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీదేవిపల్లి మండల కార్యదర్శి ధీటి లక్ష్మీపతి, జిల్లా సమితి సభ్యులు రత్నకుమారి, గుత్తుల సత్యనారాయణ, దార శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, మంద నిర్మల, నూనావత్ గోవింద్, సపావట్ రవి, బానోత్ నెహ్రు, జర్పుల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన నామినేషన్ల ఘట్టం



(మొదటిపేజీ తరువాయి)

నామినేషన్లు దాఖలు చేశారు. అభ్యర్థులు మద్దతుదారులను కూడగట్టే ప్రయత్నంలో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో చాలా చోట్ల పార్టీలను పక్కనపెట్టి స్థానిక పోత్తులకే ప్రాధాన్యత నిస్తున్నారు. జనరల్ స్థానాల్లో నామినేషన్లు వేసే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. అయితే ప్రధానంగా సర్పంచ్ అభ్యర్థులు స్థానికంగా మద్దతు కూడగట్టే ప్రయత్నంలో ఇచ్చిపుచ్చుకునే ధోరణిని అవలంభిస్తున్నారు. వార్డులు, ఉప సర్పంచులు పంచుకుంటున్నారు. కొన్ని చోట్ల ఇప్పటికే వార్డు అభ్యర్థులు సహా అందరూ నామినేషన్లు వేశారు. తొలి రోజున 192 పంచాయతీలకు సంబంధించి 99 మంది నామినేషన్లను దాఖలు చేశారు. 1740 వార్డులకు గాను తొలి రోజున 49 మంది వార్డు సభ్యులు నామినేషన్లను ఎన్నికల అధికారులకు అందజేశారు. ఈ దఫా సాధారణ నియమాలతో పాటు తప్పని సరిగా నూతన బ్యాంక్ ఖాతా ఏర్పాటు చేయాలన్న నిబంధన ఇబ్బందికరంగా మారింది. దీనితో బరిలో నిలిచే అభ్యర్థులు బ్యాంకుల చుట్టు తిరుగుతున్నారు. ఇదిలా ఉండగా సిపిఐ మద్దతుతో వి. వెంకటాయపాలెం సర్పంచ్ అభ్యర్థిగా శాఖమూరి శ్రీనివాసరావు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. చిన్నగోపతి సర్పంచ్ అభ్యర్థిగా సిపిఐ నాయకుడు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. నేరడలో సర్పంచ్ అభ్యర్థిగా దూసరి నేతాజీ నామినేషన్లను దాఖలు చేశారు.

# నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఎన్నికల నిబంధనల ప్రకారం పారదర్శకంగా విధులు కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మొదటి విడత గ్రామ పంచాయతీ నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. గురువారం నుండి మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. రఘునాథపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చింతగుర్తి, గణేశ్వరం, రఘునాథపాలెం గ్రామాల నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తనిఖీ చేశారు. దాఖలు చేసే నామినేషన్ పత్రాలను పరిశీలించారు. ఎన్నికల విధులు, బాధ్యతల పట్ల సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు.ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ఎలాంటి లోటు పాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల విధుల పట్ల అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ తర్వాత పోటీ అభ్యర్థుల ప్రకటన, వారి గుర్తులు, కేటాయింపు తదితర అంశాలపై పూర్తి బాధ్యతతో అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో ఏడు మండలాల్లో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 192 సర్పంచ్, 1740 వార్డు సభ్యుల స్థానాలకు గురువారం నుండి ఈనెల 29 శనివారం వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. మొదటి విడతలో మూడువేల సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు ఎన్నికల నిర్వహణలో సంపూర్ణ మద్దతు ఎన్నికల సిబ్బందికి అందించాలన్నారు. ఎన్నికల్లో ప్రలోభాలకు గురి చేసేందుకు అక్రమంగా నగదు, మద్యం తరలిస్తే పట్టుకుని సీజ్ చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలోని ఆయా స్టేషన్ల ఎస్‌హెచ్ఓలు సిబ్బందితో కలిసి విస్తృత తనిఖీలు చేపడుతున్నట్లు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. అర్థరాత్రి సమయంలో తిరుగుతున్న అనుమానితులను నిలువరించి వారి వివరాలు, వేలిముద్రలను సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. విజబుల్ పోలీసింగ్ పటిష్టంగా అమలు చేస్తేనే నేరాలు నియంత్రణలో ఉంటాయన్నారు. పోలీసు గస్తీ, పెట్రోలింగ్ ముమ్మరం చేశామన్నారు. హోటళ్లు, లాడ్జిలపై సోదాలు చేసి అనుమానితుల వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు అన్ని స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, పోలీసు అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. అదేవిధంగా జిల్లాలో ఉన్న రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి గంజాయి, రేషన్ బియ్యం, ఇసుక వంటి అక్రమ రవాణాను కట్టడిచేస్తున్నట్లు సిపి వివరించారు. అన్ని రకాల వాహనాలను ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు.

# గ్రామపంచాయతీ ఎన్నికల్లో సిపిఐ పోటీ



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** గ్రామపంచాయతీ ఎన్నికల్లో సిపిఐ పోటీలో ఉంటుందని జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భాను ప్రసాద్ అన్నారు. గురువారం సిపిఐ మండల కార్యవర్గ సమావేశంను కర్నాటి కృష్ణయ్య భవనంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో సిపిఐ ఐదు గ్రామపంచాయతీలో పోటీ చేస్తుందని తెలిపారు. భైరవునిపల్లి, అజయ్ తండా, సదాశివపురం, కొత్త కొత్తూరు, తిరుమలాపురం గ్రామాలలో సిపిఐ పోటీలో ఉంటుందని తెలిపారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజల సమస్య పై పోరాటం చేసే పార్టీ వైపు ప్రజలు చూస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు, మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు, మండల సహాయ కార్యదర్శి మాలోతు అయోధ్య, కార్యవర్గ సభ్యులు పాలపాటి అశోక్, అనంతపుల్లయ్య, చావా గణపతి రావు, మేకల పుల్లయ్య, చిర్ర ప్రసాద్, రంజిత్, వల్లాల కృష్ణ పాల్గొన్నారు.

# రాబోయే రోజుల్లో కమ్యూనిస్టులదే పైచేయి

## సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల సిపిఐలో భారీ చేరికలు



**ప్రజాపక్షం/చింతకాని :** బస్వాపురం గ్రామంలో పలు పార్టీల నుండి గురువారం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి సమక్షంలో సిపిఐ పార్టీలో భారీగా చేరారు. జితేందర్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బస్వాపురంలో జరిగిన సభలో జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ నేటి కాలంలో కమ్యునిస్టుల అవసరం ప్రజలకు ఎంతైనా ఉందన్నారు. సామాన్య ప్రజలందరూ కమ్యునిస్టుల పాలన కోసం ఎదురు చూస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో కమ్యునిస్టులదే పై చేయి అవుతుందన్నారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో బస్వాపురంలో సిపిఐ జెండా తిరిగి రెపరపలాడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు,పావులూరి మల్లిఖార్జునరావు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు రాసాల మోహనరావు మండల సహాయ కార్యదర్శి మార్గం శ్రీను, నాయకులు కన్నెబోయిన విజయమ్మ, బొడ్డు కొండలరావు, ఆవుల నర్సింహారావు, బద్దల సైదులు, శాఖ కార్యదర్శి బద్దల నర్సింహారావు, పుల్ల వెంకయ్య, కుక్కల సైదులు, దొంతగాని రాంబాబు,తిరుమలరావు , శ్రీకాంత్, గోపి, వంగూరి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైరా మండలంలో నామినేషన్‌ల స్వీకరణ

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ శ్రీజ





**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలోని మొత్తం 22 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరగనున్న నేపధ్యంలో గురువారం నుంచి ప్రారంభమైన ఎన్నికల నామినేషన్లకు సంబంధించి 7చోట్ల నామినేషన్లను కేంద్రాలను ఏర్పాటు చేశారు. ముసలిమడుగు, సిరిపురం, గరికపాడు, గన్నవరం, పాలడుగు, గొల్లపూడి, రెబ్బవరం పంచాయతీ కార్యాలయాల్లో నామినేషన్ కేంద్రాలు ఏర్పాట్లు చేశారు. ఈ నామినేషన్ కేంద్రాల వద్ద ఏఏ పంచాయతీ నుండి పోటీ చేసే అభ్యర్థులు ఆ నామినేషన్ కేంద్రంలో నామినేషన్ దాఖలు చేసే విధంగా ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుండి ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను ఆయా కేంద్రాల్లో పోలింగ్ అధికారులు స్వీకరిస్తారని తెలిపారు. ముసలిమడుగు గ్రామపంచాయతీ కార్యాలయంలో ముసలిమడుగు, లక్ష్మీ పురం, నారపునేనిపల్లి గ్రామాలకు చెందిన నామినేషన్‌లు సిరిపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో సిరిపురం, పుణ్యపురం, స్టేజిపినపాక గ్రామాలకు చెందిన నామినేషన్లు, గరికపాడు గ్రామపంచాయతీ కార్యాలయంలో గరికపాడు, లింగన్నపాలెం, దాచాపురం, విప్పలమడక గ్రామాలకు చెందిన నామినేషన్లు, గన్నవరం గ్రామపంచాయతీ కార్యాలయంలో గన్నవరం, గోవిందాపురం, ఖానాపురం, కొండకొడిమ గ్రామాలకు చెందిన నామినేషన్లు స్వీకరిస్తారు. పాలడుగు గ్రామపంచాయతీ కార్యాలయంలో పాలడుగు, వల్లాపురం గ్రామాలకు చెందిన నామినేషన్లు స్వీకరిస్తారు. గొల్లపూడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గొల్లపూడి, అష్టగుర్తి, గొల్లెనపాడు గ్రామాలకు చెందిన నామినేషన్లు స్వీకరణ, రెబ్బవరం గ్రామపంచాయతీ కార్యాలయంలో రెబ్బవరం, తాటిపూడి, కొష్టాల గ్రామాలకు చెందిన నామినేషన్లు స్వీకరించారు. నామినేషన్ కేంద్రాలు పరిశీలించిన అదనపు కలెక్టర్ వైరా మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల నేపద్యంలో నామినేషన్ల కోసం ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను గురువారం అదనపు కలెక్టర్ శ్రీజ పరిశీలించారు. ఈ సందర్భంగా పలు వివరాలను పోలింగ్ కేంద్రం వద్ద అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీజ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులుగా ఉండవద్దని ఎలాంటి తప్పిదాలు జరగవద్దని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో సక్రియ, డిటి సురేష్‌బాబు, ఎంపివో రాజేశ్వరరావు పాల్గొన్నారు.

# మీడియా సెంటర్‌ను ప్రారంభించిన అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్‌లోని డిపిఆర్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసిఎంసి)ను అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎన్నికలు సక్రమంగా నిర్వహించడంలో పాత్రికేయులు తమ వంతు పాత్ర పోషించాలన్నారు. ఓటు హక్కు ప్రాముఖ్యత గురించి ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. ఎన్నికల ప్రచారంలో వీడియోలు వినియోగించాలంటే ముందుగా మీడియా సెంటర్‌లోని ఎంసిఎంసి కమిటీని సంప్రదించి అనుమతి తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిపిఆర్‌వో ఎంఎ గౌస్, డిపివో ఆశాలత, అదనపు పిఆర్‌వో ఎండి అయూబ్ ఖాన్, ఎంసిఎంసి కమిటీ సభ్యులు, కార్యాలయ టైపిస్ట్ ప్రవళిక, కంప్యూటర్ ఆపరేటర్లు నవీన్, హరీష్, సిబ్బంది, చింతల శ్రీనివాసరావు, చావా నారాయణ, తాజుద్దీన్, మంగ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు కాలనీలో ఆంజనేయస్వామి విగ్రహావిష్కరణ



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల కేంద్రం ఎర్రుపాలెంలోని జర్నలిస్టుల కాలనీ వద్ద శ్రీ అభయ ఆంజనేయస్వామి విగ్రహాన్ని గురువారం ఎర్రుపాలెం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి విగ్రహానికి ఉదయం నుండి పురోహితులు కొత్తూరు సీతయ్య శాస్త్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, భక్తులు అధికసంఖ్యలో ఈ విగ్రహ ప్రతిష్ట పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. విగ్రహ దాత యర్రమల పూర్ణ చంద్రారెడ్డిని మండల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, చావా రామకృష్ణ, కంచర్ల వెంకట నర్సయ్య, కడియం శ్రీనివాసరావు, ఎస్కే ఇస్మాయిల్, మల్లెల లక్ష్మణరావు, గూడూరు వెంకటేశ్వరరెడ్డి, దివ్వెల వీరయ్య, నూతక్కి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేత



**ప్రజాపక్షం/మధిర :** మధిరలోని టివిఎం పాఠశాలకు చెందిన క్రీడాకారులకు రూ.31వేల విలువ చేసే 82జతల క్రీడా దుస్తులు దాతల సహకారంతో వితరణగా అందించారు. మధిర పూర్వ విద్యార్థి, ఆదర్శ రైతు పుల్లఖండం సత్యనారాయణ మూర్తి పుల్లఖండం వెంకటపురుషోత్తం అనసూయ స్మారక ట్రస్టు ద్వారా ఎంఇఓ వై.ప్రభాకర్ చేతుల మీదుగా క్రీడా ఉపాధ్యాయులు నర్సింహారావుకు ఏకరూప దుస్తులను అందచేశారు. అందులోని 12 దుస్తులను వాలీబాల్ క్రీడాకారులకు అందచేశారు. వాలీబాల్ క్రీడాకారులకు వాకర్స్ క్లబ్ తరుపున ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు, మధిర ప్రాంత విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘం బాధ్యులు పుతుంబాక శ్రీకష్ణప్రసాద్, మాధవరపు నాగేశ్వరరావు, బాబ్లా, వై.నాగభూషణం, వంగవీటి రాజశేఖర్, సామాజిక సేవకుడు లంకా కొండయ్య, టివిఎం వాకర్స్ క్లబ్ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు తదతరులు పాల్గొన్నారు.

# మధిరలో పంచాయతీల రిజర్వేషన్లు ఖరారు

**ప్రజాపక్షం/ మధిర :** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మధిర మండలంలోని 27 గ్రామ పంచాయతీలకు గాను సర్పంచ్‌ల రిజ్వర్వేషన్లు ఖరారయ్యాయి. అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని మునగాల గ్రామపంచాయతీ ఎస్టీ జనరల్ కాగా మాటూరు, దేశినేనిపాలెం, చిలుకూరు, దెందుకూరు, వంగవీడు ఎస్సీ జనరల్ రిజర్వ్ అయ్యాయి. ఆత్కూరు, సిద్దినేనిగూడెం, నిధానపురం గ్రామపంచాయతీలు ఎస్సీ మహిళ, తొండలగోపారం, సైదిల్లీపురం బిసి మహిళ రిజర్వ్ కాగా ఖాజీపురం, నాగవరప్పాడు, నక్కలగరుబు, రాయపట్నం, బయ్యారం, వెంకటాపురం జనరల్ కేటాయించారు. జాలిముడి, మల్లారం, సిరిపురం, రామచంద్రాపురం, రొంపిమళ్ళ, అల్లీనగరం, ఇల్లూరు జనరల్ మహిళకు కేటాయించారు. గురువారం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కావటంతో ఆయా క్లస్టర్ల పరిధిలో ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద తొలిరోజు అధికసంఖ్యలో వివిధ పార్టీల నుండి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల హడావుడి మొదలైంది.

# జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో రాణించిన మాటూరు విద్యార్థులు



**ప్రజాపక్షం/ మధిర :** కల్లూరులో జరిగిన అండర్ 14, 17 విభాగాల్లో జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో మధిర మండలం మాటూరు పాఠశాల విద్యార్థులు రాణించి ప్రథమ, తృతీయ స్థానాలు సాధించినట్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి కొలగాని ప్రసాదరావు తెలిపారు. పాఠశాలకు చెందిన చిలువేరు జయశ్రీ, మేడిశెట్టి భవాని, మేడిశెట్టి శివానిలు ఖో ఖో పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చి అండర్ 14 విభాగంలో మొదటి స్థానం, అండర్ 17 విభాగంలో తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో చదువుకు ఎంత ప్రాముఖ్యత ఉంటుందో క్రీడలకు కూడా అంతే ప్రాముఖ్యత ఉంటుందని, చిన్నారులు తమకు లభించిన అవకాశాన్ని చక్కగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ఎంపికి వినతి



**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల పరిధిలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలోని రైల్వే గేటు వద్ద అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంపి రామసహాయం రఘురామిరెడ్డికి వినతి పత్రం అందచేశారు. గురువారం ఎంపిని గ్రామ శాఖ అధ్యక్షులు భాగం పాపారావు ఆధ్వర్యంలో నాయకులు కలిసి గోవిందాపురం(ఎల్) గ్రామంలో రైల్వే అండర్ బ్రిడ్జి లేకపోవడం వల్ల సరైన రవాణా వ్యవస్థ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రైల్వే అధికారులతో మాట్లాడి త్వరలో బ్రిడ్జి ఏర్పాటు చేసే విధంగా చూడాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో విన్నవించారు. దీనికి సానుకూలంగా స్పందించిన వారు రైల్వే అధికారులతో మాట్లాడి త్వరలోనే బ్రిడ్జి ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భాగం నాగేశ్వరరావు, భాగం శ్రీనివాసరావు, గండమాల రాయప్ప, భాగం రాధాకృష్ణమూర్తి, షేక్. యాసిన్ పాల్గొన్నారు.

# మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి





**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన వైరాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నూతి సత్యనారాయణ గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ కూడా మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సర్పంచ్ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు

ప్రజాపక్షం/పెనుబల్లి: పెనుబల్లి మండల పరిధిలోని పలు గ్రామాలలో డిసెంబర్ 17 నిర్వహించే సర్పంచుల ఎన్నికలకు అభ్యర్థుల కసరత్తులు ప్రధాన ప్రతిపక్ష పార్టీలు కసరత్తులలో నిమఘ్నమై ఉన్నారు. పలు గ్రామాలలో ప్రధాన పార్టీ కాంగ్రెస్‌లో అభ్యర్థులు ఎంపిక కూడా పూర్తయినట్లు సమాచారం. ఒక్కో గ్రామానికి మూడు లేక నాలుగు పేర్లు తయారుచేసి సత్తుపల్లి నియోజకవర్గంలోని అధిష్టానం కు పంపించినట్లు సమాచారం. డిసెంబర్ మూడో తేదీ లోపు అభ్యర్థుల ఎంపిక పూర్తి కానున్నట్లు సమాచారం .మండల పరిధిలోని 32 గ్రామ పంచాయతీలలో జనరల్ స్థానాలు 7, బిసి 3, ఎస్సీలు 5, ఎస్టీలు 11, మహిళలు 6 రిజర్వ్‌డ్ జనరల్ స్థానాల్లో ఎన్నికల్లో పోటీకి ఆసక్తికరం గా, ఎస్‌సి, ఎస్‌టి, బిసి స్థానాల్లో బరిలో ఉండేందుకు ఆసక్తి లేనట్లు సమాచారం. మండల పరిధిలోని అన్ని పంచాయతీ లలో అభ్యర్థుల కోసం ఆర్థిక బలం. రాజకీయ బలం, ప్రజాబలం ఉన్నవారిని ఎంపికలు చేస్తున్నట్లు ఆయా గ్రామాల నాయకులు తెలుపుతున్నారు. ఒక్కో గ్రామానికి నలుగురు చొప్పున పేర్లను తయారుచేసి అధిష్టానానికి పంపించి ఎంపికలు పూర్తి చేయడానికి సిద్ధం చేసినట్లు గ్రామాల్లో చర్చలు కొనసాగుతున్నవి. ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ సత్తుపల్లి నియోజకవర్గంలో బలంగా ఉన్న గ్రామాల్లో ఎంపిక ప్రక్రియ కూడా రెండు రోజుల్లో సమావేశాలు నిర్వహించి అభ్యర్థి ఎంపికలు పూర్తి చేయనున్నట్లు సమాచారం. వామపక్ష పార్టీలు కూడా రాష్ట్ర జిల్లా నాయకత్వ ఆదేశాలపై ఆధారపడి ఉంటుందని సమాచారం. ఎంపికలు ప్రక్రియ డిసెంబర్ మూడో తేదీ లోపు పూర్తవుతుందని ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు తెలుపుతున్నారు. ఏది ఏమైనప్పటికీ మండలంలో ఎన్నికలు జరిగే గ్రామాలలో ప్రస్తుతం రాజకీయ వేడి ప్రారంభమైంది.

## అజ్మీర నీలిమ గెలుపు నల్లేరు మీద నడకే..



ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : మండల పరిధిలోని అజ్మీర తండా గ్రామపంచాయతీ కాంగ్రెస్ అభ్యర్థి అజ్మీర నీలిమ గెలుపు నల్లేరు మీద నడకే అని సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ సొసైటీ వైస్‌చైర్మన్ అజ్మీర బాలాజీ అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ ఆశీస్సులతో గ్రామపంచాయతీ సర్పంచ్‌గా అజ్మీర నీలిమను ఎంపిక చేయటం ఎంతో సంతోషదాయకమని సుధీర్ఘ కాలం పాటు మండలంలో కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ఎన్నో అందించానని కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలకు ఎంతో కృషి చేశానని ఆసేవలను గుర్తించి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెఇ సూచనలతో అజ్మీర్ తండా సర్పంచ్ అభ్యర్థిని అజ్మీర నీలిమను ఎంపిక చేయటం గెలుపు ఇప్పటికే ఖాయం అయినట్లు అని తెలిపారు. అజ్మీర తండా గ్రామపంచాయతీలో మొత్తం 700 ఓటర్ల 8 వార్డులు ఉండగా వార్డు సభ్యులతో సహా ఉపసర్పంచి సర్పంచి కైవసం చేసుకుంటుందని ఆయన అన్నారు. అజ్మీరరర నీలిమ విద్యార్హత గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండటం గ్రామపంచాయతీ అభివృద్ధికి పాటుపడుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందే విధంగా గ్రామాభివృద్ధికి కృషి చేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అభివృద్ధిని చూసి సర్పంచ్‌గా గెలిపించాలని అజ్మీర తండా గ్రామ ప్రజలంతా నీలిమను దీవించాలని ఆయన కోరారు.

## ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

### జిల్లా సరిహద్దు వద్ద చెక్‌పోస్టులో తనిఖీలు



ప్రజాపక్షం/నేలకొండపల్లి : ప్రతీ వాహనం ను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని నేలకొండపల్లి ఎంపీడీఓ, మండల కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారి యం.యర్రయ్య సూచించారు. జిల్లా సరిహద్దు గ్రామమైన పైనంపల్లి వద్ద ఏర్పాటు చేసిన చెకోపోస్టును గురువారం ఆకసిక్మంగా తనిఖీ చేశారు. సిబ్బంది కి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మధ్యం, డబ్బు, ఇతరత్రా వస్తువులు అక్రమంగా రవాణా చేయకుండా చూడాలని ఆదేశించారు. ఎంతటి వారి వాహనం అయినా సరే తనీఖీ చేయాల్సిందేన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఎన్నికల నియమావళిని బచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఎన్నికల కోడ్ నుఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

ప్రజాపక్షం/నేలకొండపల్లి : దివ్యాంగుల దినోత్సవం ను ఘనంగా నిర్వహించాలని టీడీ, జేపీసీ చైర్మన్ పీవీ చలమయ్య సూచించారు. మండల కేంద్రంలో గురువారం సంఘం సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే నెల 3న జరిగే ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పలు కార్యాక్రమాలు చేపట్టాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో దివ్యాంగుల కు 5 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ మేనిఫస్టో లో దివ్యాంగులకు ఇచ్చిన హమీని అమలు చేయకపోవటం బాధాకరమని పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు దివ్యాంగులు పోటీ చేసిన చోట ఇతరులు పోటీ చేయకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు నాగేశ్వరరావు, వీరన్న, పుల్లయ్య, రమాదేవి. అనిత, వర్ష, నాగలక్ష్మి, వేణు, మురళీధర్, సురేష్, బ్రహ్మయ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పల్లె పాలనకు 61 ఏళ్లు..!



ప్రజాపక్షం/నేలకొండపల్లి : ప్రజాస్వామ్య వ్యవస్థలో మూలస్థంభమైన గ్రామపంచాయతీలుఏర్పాటు, కాలానుగుణంగా చోటు చేసుకున్న మార్పులు ఆసక్తిగా ఉన్నాయి. స్వాతంత్రం వచ్చిన తరువాత పంచాయతీరాజ్ సంస్థల ఏర్పాటు కోసం 1957 లో భారత ప్రభుత్వం బల్వంత రాయ్ మోహాతా కమిటి ని నియమించింది. ఈ కమిటీ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం మూడెంచల గ్రామ పంచాయతీ, పంచాయతీ సమితి, జిల్లా పరిషత్ వ్యవస్థల ను ఏర్పాటు చేయాలని చేసిన సూచనలను జాతీయాభివృద్ధి సంస్థ 1958 లో అమోదించింది. దీంతో అప్పటి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర పంచాయతీరాజ్ సంస్థల చట్టం ఏర్పాటు చేసింది. దీనిని మొదటి గా రాజస్థాన్ రాష్ట్రంలో అమలు చేయగా...ఏపీ లో రాష్ట్ర దీనిని 1959 ఆక్టోబర్ 2 న అమలు చేసింది.

### మొదట్లో పరోక్ష పద్ధతి....

ఏపీ రాష్ట్రంలో 1964 లో సమగ్ర గ్రామ పంచాయతీల చట్టం ప్రకారం 500 పైగా జనాభా ఉన్నగ్రామాలను ఒక పంచాయతీగా ఏర్పాటు చేశారు. జనాభా ను బట్టి 5 నుంచి 17 మంది వరకు వార్డు సభ్యులు ఉండవచ్చునని దీనిలో పేర్కోన్నారు. 1964 లో సర్పంచ్‌ల ఎన్నికలు పరోక్ష పద్ధతిలో జరిగాయి. వార్డు సభ్యులను ఓటర్లు ఎన్నుకుంటే... వార్డు సభ్యులు సర్పంచ్ లను ఎన్నుకునే వారు.ఎన్నికైన సర్పంచ్‌లు కలిసి సమితి ప్రెసిడెంట్ లు, జిల్లా పరిషత్ అద్యక్షుడు, ఉపాధ్యాక్షుడు ను ఎన్నుకునేవారు. 1976 వరకు ఇదే పద్ధతి కొనసాగింది. వీరి ఎన్నిక లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కు ఓటు హక్కు ఉండేది.

### 1964 తొలిసారి పంచాయతీ ఎన్నికలు

### 1978 నుంచి ప్రత్యక్ష పద్ధతి....

ఏపీ ప్రభుత్వం 1978లో నరసింహాం కమిటి ని ఏర్పాటు చేశారు. సర్పంచ్‌లకు ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నుకోవాలని ఈ కమిటి సూచించింది. దీంతో అప్పటి నుంచి సర్పంచ్‌ల ఎన్నిక ప్రక్రియ ప్రత్యక్ష పద్ధతి లోనే నిర్వహిస్తూ వస్తున్నారు.

### ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్‌లు...

1992 లో అమలు లోకి వచ్చిన 73 వ రాజ్యంగం సవరణ ప్రకారం గ్రామ పంచాయతీలకు షెడ్యూల్ కులాలు, తెగల వారికి జనాభా ప్రతిపాధికన రిజర్వేషన్లు కల్పించాలని, అలాగే మూడో వంతు మహిళలకు రిజర్వు చేయాలని సూచించింది. అప్పటి నుంచి గ్రామ పంచాయతీ, మండల,జిల్లా పరిషత్‌లలో రిజర్వేషన్‌లు అమలు అవుతున్నాయి.

### మండల వ్యవస్థ తో మార్పులు...

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 1986 ఫిబవరి 15 న అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టీరామారావు తాలూకాలను రద్దు చేసి మండల వ్యవస్థ ను ఏర్పాటు చేశారు. మండలాలకు 1987 లో తొలిసారి ఎన్నికలు జరిగాయి. మండల పరిషత్ అద్యక్షడు ని నేరుగా ఎన్నుకున్నారు. దీనిలో సభ్యులుగా ఆయా మండలాల పరిధిలోని సర్పంచ్‌లు ఉండే వారు ఎంపీపీ, జిల్లా పరిషత్ చైర్మన్ లను ఎన్నుకునేవారు.

### ఏపీ పంచాయతీరాజ్ చట్టం-1984 ద్వారా పరిషత్ వ్యవస్థ..

ఏపీ పంచాయతీరాజ్ చట్టం 1984 ద్వారా అదే సంవత్సరం నుంచి గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ అనే మూడుంచెల వ్యవస్థ ను అమోదించింది. మండల పరిషత్ లో సర్పంచ్‌లు సభ్యులు గా తొలిగించి వారి స్థానంలో ఎంపీటీసీ లను సభ్యులు, జిల్లా పరిషత్ సభ్యులు గా తోలిగించి జడ్పీటీసీ లను చేర్చారు. మెజార్టీ ఎంపీటీసీ, ఎంపీపీ ని మెజార్టీ జడ్పీటీసీ లు జడ్పీ చైర్మన్ ను ఎన్నుకోవటం ప్రారంభమైంది.

# మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ షురూ..!





ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడు మండలంలోని 18 గ్రామ పంచాయితీలలో మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. పంచాయితీ ఎన్నికల షెడ్యూల్ వెలువటంతో గ్రామాల్లో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. మండలంలో మొట్ట మొదటిగా లక్ష్మీ పురం గ్రామ పంచాయితీ సర్పంచ్ అభ్యర్థిగా సంగు వెంకట సుబ్బారెడ్డి తన నామినేషన్‌ను దాఖలు చేశారు. మండలంలోనే మొదటి సర్పంచ్ అభ్యర్థిగా ఆయన నామినేషన్ వేయడం విశేషం, కాగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి నామినేషన్ పత్రాలను పరిశీలించి స్వీకరించారు. అదే విధంగా బూర్గంపాడు గ్రామ పంచాయిలో బర్ల నాగమణి, పుట్టి కుమారి, మందా నాగారాజులు సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేయగా, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పరిశీలించి స్వీకరించారు. సారపాక గ్రామ పంచాయితీలో బిఆర్ఎస్ పార్టీ నుండి సారపాక సర్పంచ్ అభ్యర్థిగా బానోత్ శ్రీను నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందించారు. అదే విధంగా మొత్తంగా చూస్తే 18 గ్రామ పంచాయితీల్లో సర్పంచ్‌లుగా 9 మంది, 7గురు వార్డు సభ్యులుగా నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల అధికారి జములారెడ్డి తెలిపారు. బూర్గంపాడు సర్పంచ్ అభ్యర్థులుగా 3, ముసలమడుగు సర్పంచ్‌గా 1, లక్ష్మీపురంలో సర్పంచ్ అభ్యర్థులుగా 2, సారపాకలో సర్పంచ్ అభ్యర్థులుగా 2, కోయగూడెం సర్పంచ్ అభ్యర్థిగా 1 చొప్పున సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్ వేశారు. అదే విధంగా సారపాకలో వార్డు సభ్యులుగా 6, సోంపల్లి వార్డు సభ్యులుగా 1 సభ్యులు నామినేషన్ దాఖలు చేశారని తెలిపారు. ఇరవెండి, మోరంపల్లిబంజర్, టేరంపల్లిబంజర్, నాగినేనిప్రోలురెడ్డి పాలెం, పినపాక పట్టినగర్, ఉప్పుసాక, అంజనాపురం, నకిరిపేట, వేపలగడ్డ, మోతెపట్టినగర్, తాళ్లగొమ్మూరు, కృష్ణసాగర్ గ్రామాలలో ఒక్క నామినేషన్ కూడా దాఖలు చేయలేదని తెలిపారు. కాగా నామినేషన్లకు నేడు, రేపు మాత్రమే సమయం ఉండటంతో నేడు అత్యధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేసే అవకాశం లేకపోలేదు. సమయం తక్కువగా ఉండటంతో అభ్యర్థులు చివరి నిమిషం వరకు నామినేషన్లు దాఖలు చేసే అవకాశాలు ఉన్నాయి.

### నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు...

బూర్గంపాడు మండలంలో నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జిల్లా సాధారణ పరిశీలకులు సర్వేశ్వర్‌రెడ్డి, జిల్లా జెడ్‌పి సీఈఓ నాగలక్ష్మి, డిపిఓ అనూష, ఎంపీడీవో జములారెడ్డిలు పరిశీలించారు. ఈసందర్భంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఏ విధంగా జరుగుతుందని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

## ఖోఖో పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

ప్రజాపక్షం/ఏన్కూరు : జిల్లాస్థాయి ఖో ఖో కల్లూరులో జరిగిన ఎస్ జి యఫ్ క్రీడా పోటీల్లో ఏన్కూరు గురుకుల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయి ఖో ఖో లో పాల్గొననున్నారు. .ఖో ఖో విభాగంలో వి సాత్విక్, ఎం హెమచరణ్, షణ్ముఖ నాయక్, లేసాక్షి నందన్ 4 గురు విద్యార్థులు వికారాబాద్ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గురుకుల విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను గురువారం ప్రిన్సిపాల్ వేముల రాజు, ఏటిపి శ్రీనివాస్, డిప్యూటీ వార్డెన్ జమున రాణి,అంజద్ పాషా, పిఈటి వీర, పిడి సునీల్, ఉపాధ్యాయులు లక్ష్మి, సునీల్, విశ్వేశ్వర రావు, రజిని, విజయ కుమారి, కుటుంబరావు, శ్రీనివాస్ రెడ్డి, రవికుమార్, శివకుమార్, సతీష్, నరసింహారావు లు అభినందించారు.



# ఐపిఎస్ వసుంధర యాదవ్ దూకుడు..!

### -పోలీసు వ్యవస్థలో క్రమశిక్షణకు కొత్త పుంతలు
### -మార్పు మొదలైదంటున్న ప్రజలు



ప్రజాపక్షం/సత్తుపల్లి: పదవి చేపట్టిన కొద్ది రోజులకే కల్లూరు కొత్త అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) ఐపిఎస్ అధికారిణి వసుందర యాదవ్ తనదైన శైలిలో దూకుడు ప్రదర్శిస్తున్నారు. ప్రజలకు సమర్థవంతమైన, సత్వర సేవలు అందించాలనే లక్ష్యంతో వసుంధర యాదవ్ డివిజన్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లను ఆకస్మిక తనిఖీలు చేస్తూ సిబ్బందికి సున్నితంగా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఏసీపీ తీసుకున్న ఈ చర్యలు పోలీసు వర్గాలతో పాటు స్థానికుల్లోనూ చర్చకు దారి తీస్తున్నాయి. స్టేషన్ లలో ఏం జరుగుతుంది, సిబ్బంది పనితీరు, స్టేషన్ పరిసరాలు, ప్రజలకందుతున్న సేవలు, ప్రజలతో సిబ్బంది మసలుకుంటున్న తీరు తదితరాలు ఏసిపి స్వయంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తుంది. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రతి అంశాన్ని స్వయంగా పరిశీలిస్తూ, బాధ్యతాయుతంగా పనిచేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ముఖ్యంగా స్టేషన్ రికార్డులు, నిర్వహణ, పెండింగ్ కేసుల వివరాలు, పురోగతి,సిబ్బంది హాజరు, పనితీరు, లా అండ్ ఆర్డర్ (శాంతిభద్రతలు) పరిస్థితి, ప్రజా ఫిర్యాదులపై స్పందన తదితరాలు అడిగి తెలుసుకుంటున్నారు. అంతేకాకుండా సిబ్బందితో స్వయంగా సమావేశమై ప్రత్యేక సూచనలు చేస్తున్నారు. సిబ్బంది తమ బాధ్యతను పెంచుకుని, వృత్తిపరమైన నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని, క్రమశిక్షణను అత్యున్నత ప్రమాణాలతో పాటించాలని ఆదేశిస్తున్నారు. ప్రజల నుండి అందిన ప్రతి ఫిర్యాదును ఆలస్యం చేయకుండా వెంటనే నమోదు చేసి, తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్ ను అమలు చేస్తూ ప్రజలను సేవా భావనతో చూడాలని, వారిపట్ల మర్యాదగా వ్యవహరించి, పోలీసు వ్యవస్థపై విశ్వాసాన్ని పెంచాలని సూచిస్తున్నారు. పోలీసులు ప్రజలకు అండగా నిలవాలని, బాధ్యతాయుతంగా పనిచేస్తేనే న్యాయం వేగంగా అందుతుందని, ప్రతి పోలీసు అధికారి తమ పాత్రను శ్రద్ధగా, అంకితభావంతో నిర్వర్తిస్తే, నేరాన్ని అరికట్టడం మరింత సులభమవుతుందని ఆమె సూచిస్తున్నారు. ఏసీపీ ఆకస్మిక తనిఖీలతో స్టేషన్లలో క్రమశిక్షణ, సిబ్బందిలో బాధ్యత పెరుగుతాయని ప్రజలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రతి మండల కేంద్రంలో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతుందని దీనిపై ఏసీపి అధికారిణి ప్రత్యేక శ్రద్ధ పెట్టి ట్రాఫిక్ ను పూర్తిగా నియంత్రించేలా ఆయా స్టేషన్ల సిబ్బందికి ఆదేశాలు జారీ చేయాలని, అంతేకాకుండా ఫుట్‌పాత్ ల ఆక్రమణలు తొలగించి, వృద్ధులు, మహిళలు, విద్యార్థులు ప్రమాదాల బారిన పడకుండా చూడాలని ప్రజలు ఏసీపీకి విజ్ఞప్తి చేస్తున్నారు.

# సమన్వయంతో పని చేయండి విజయం మనదే..



### -ఎంఎల్‌ఏ జారే

ప్రజాపక్షం/చంద్రుగొండ: మండల కాంగ్రెస్ పార్టీలో సఖ్యత లేకుండా గ్రూపులతో పని చేస్తున్న నాయకులు స్థానిక ఎన్నికల్లో సమన్వయంతో పని చేస్తే గెలుపు మనదేనని అశ్వారావుపేట ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ నాయకులకు సురకలు అంటించినట్టు సమాచారం. గురువారం మండల పరిధిలోని దామరచర్ల గ్రామంలో ఎస్సార్ ఫంక్షన్ హాల్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రూపులు పక్కనపెట్టి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందించే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి గెలుపే లక్ష్యంగా పని చేయాలని నాయకులకు కార్యకర్తలకు సూచించారు. మండల పరిధిలోని 14 గ్రామ పంచాయితీలలో సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని అన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయితీలకు ప్రభుత్వం ఇచ్చే పది లక్షలతో పాటు ఎంఎల్‌ఏ నిధుల నుండి 10లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు. దీని దృష్టిలో పెట్టుకొని సర్పంచ్‌లను ఏకగ్రీవంగా చేసే విధంగా అధికార పార్టీ ప్రతిపక్ష పార్టీలు కలిసి నిర్ణయించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోవింద్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు తుమ్మలపల్లి సురేష్, జిల్లా నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, భోజ్యనాయక్, నల్లమోతు రమణ, సారేపల్లి శేఖర్, కిరణ్‌రెడ్డి, అన్వర్, లంక విజయలక్ష్మి, ఇస్లావత్ రుక్మిణి, బడుగు కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేస్తాం

### -పాల్వంచ డిఎస్‌పి సతీష్ కుమార్





ప్రజాపక్షం/బూర్గంపాడు: సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చిన సందర్భంగా సబ్ డివిజన్ పరిధిలో ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేస్తామని పాల్వంచ డివిస్‌పి సతీష్ కుమార్ తెలిపారు. గురువారం బూర్గంపాడు మండలంలోని నాగినేనిప్రోలురెడ్డిపాలెం, బూర్గంపాడు, సారపాక, మోరంపల్లిబంజర్ గ్రామ పంచాయితీలలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనలు, నియమనిబంధనల మేరకు ఎన్నికల ప్రవర్తన నియమావళిని(ఎన్నికల కోడ్) పటిష్టంగా అమలు చేస్తామని, ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున మండల ప్రజలు, పౌరులు, రాజకీయ పార్టీల అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. శాంతి భద్రతలకు ఎలాంటి ఆటంకం కలిగించవచ్చవద్దని కోరారు. అనుమానాస్పద కార్యకలాపాలపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఒక పండుగలాగా జరగాలని అందరూ చట్టాన్ని గౌరవిస్తూ శాంతియుతంగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని తెలిపారు. నియమావళి నిబంధనలు ప్రకారం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిఘా పెడుతున్నామని, ప్రజలు ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతి పౌరుడు స్వేచ్ఛగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, నిషేదిత వస్తువులు అక్రమ మద్యం, నాటు సారా. డబ్బు, ధృవపత్రాలు లేని విలువైన ఆభరణాలు, వస్తువులు అక్రమ రవాణా జరగకుండా ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తామని, సమస్య ఆత్మకమైన పోలింగ్ కేంద్రాలు ఉన్న గ్రామాల్లో ప్రత్యేకమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత ఎన్నికలలో కేసులల్లో ఉన్న నేరస్థులను ముందస్తుగా బైండోవర్ చేయడం, సమస్యలు సృష్టించే ట్రబుల్ మాంగ్రర్స్‌లను ముందస్తు బైండోవర్ చేస్తామన్నారు. సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంచామని, తప్పుడు సమాచారం, రెచ్చగొట్టే విధంగా అవమానపరిచే విధంగా రూమర్స్ సృష్టించడం లాంటివి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తే సంబంధిత వ్యక్తులు, వాట్సప్ అడ్మిన్‌లపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ మేడా ప్రసాద్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థులకు స్వెటర్స్ అందజేత



ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడులోని సేవా భారతి ద్వారా నడుస్తున్న వనవాసి వికాస కేంద్రం భారతీభవన్ ఆవాసంలో 26 మంది పేద గిరిజన విద్యార్థులకు స్వెట్రస్‌ను పాల్వంచ రేంజ్ ముసలమడుగు సెక్షన్ సోంపల్లి బీట్ ఆఫారెస్ట్ ఆఫీసర్ సోడె శ్రీరాములు గురువారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చలి కాలంలో స్వెటర్స్ ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. నిరుపేద విద్యార్థులు మీకు ఎన్ని కష్టాలు వచ్చినా చదువు అపకుండా చక్కటి సంస్కారంతో చదువుకొని ఉన్నత స్థానాలను అధిరోహించాలని సేచించారు. అదే విధంగా పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని, నీటిని పొదుపు చేయడం, మొక్కల్ని నాటడం రక్షించడం, పెంచటం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకుండా ఉండటం వల్ల పర్యావరణం మెరుగుపడుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో భారతీ భవన్ ఆవాస కమిటీ మెంబర్ పొదిల హిమవంతు, హాస్టల్ వార్డెన్ పాలంచ సమ్మక్కలు మాట్లాడుతూ భారతీ భవన్ ఆవాసం దాతల సహకారంతో నడుస్తున్న ఆవాసమని, ఎవరైనా దాతలు ముందుకు వచ్చి హాస్టల్ విద్యార్థులకు ఏమైనా సహాయం చేయాలనుకుంటే 9014160810, 9505629881 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

## జిల్లా కమిటీ విస్తృత సమావేశాలను జయపద్రం చేయండి



ప్రజాపక్షం/కారేపల్లి: నవంబర్ 30న కల్లూరులో జరిగే జిల్లా కమిటీ విస్తృత సమావేశాలను జయపద్రం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బానోత్ రాందాస్, జిల్లా కమిటీ సభ్యుల సత్తా ఫణికుమార్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీ కృష్ణారావు, బానోత్ మంగీలాల్‌లు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా విస్తృత సమావేశాల పోస్టర్లను, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసమావేశాలకు ముఖ్య అతిథులుగా సత్తుపల్లి శాసన సభ్యులు మట్టా రాగమయి దయానంద్, టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని తదితరులు హాజరవుతారని తెలిపారు. విద్యారంగం, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, కార్యచరణ రూపొందిస్తామని కావున ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాలను జయపద్రం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు బానోత్ సూర్య, ఆర్ నాగలక్ష్మి, కోశాధికారి ఎటుకూరి నాగేశ్వరరావు, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ మద్దినేని నాగేశ్వరరావు, కార్యదర్శులు సంతులాల్, ఈర్య, రామారావు, నరేంద్ర, భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేస్తాం : డిఎస్పి



ప్రజాపక్షం/గుండాల : సర్పంచి ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చిన సందర్భంగా సబ్ డివిజన్ పరిదిలోఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేస్తామని ఇల్లందు డిఎస్పి ఎన్ చంద్రభాను అన్నారు. గురువారం పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల నియమావళి (ఎన్నికలకోడ్) పటిష్టంగా అమలు చేస్తామన్నారు. మండల ప్రజలు, పౌరులు, రాజకీయ పార్టి అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఒక పండుగా వాతవర్ణంలో జరగాలని, చట్టాన్ని గౌరవిస్తూ శాంతియుతంగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్న గ్రామాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకుంటామన్నారు. గత ఎన్నికల్లో కేసుల్లో ఉన్న నేరస్తులను ముందస్తుగా బైండోవర్ చేయడం జరుగుతుందన్నారు. అట్లాగే సోషల్ మీడియా నందు అసత్య ప్రచారాలు చేసిన , ఇతర వ్యక్తుల మనోభావాలు కించపరిచేలా పోస్టు చేసినా కఠినచర్యలు ఉంటాయన్నారు. అనుమతి లేకుండా ర్యాలీలు,సభలు సమావేశాలునిర్వహించకూడదన్నారు. ఆయనవెంట సిఐ ఎల్ రవిందర్, ఎస్సై సైదారపూఫ్ ఉన్నారు.

## మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు



ప్రజాపక్షం/మణుగూరు: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మణుగూరు డిపో వారిచే మేడారం సమ్మక్క సారలమ్మ తల్లి గద్దెల దగ్గరకు బస్సును . ది .30.11.25.న ఆదివారం నాడు ఉదయం 6:30 కి మరియు 12:30 కి ఏర్పాటు చేయడం జరిగిందని డిపో మేనేజర్ కె శ్యాంసుందర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. మణుగూరు, అశ్వాపురం, పినపాక, కరకగూడెం మండలాల ప్రజలు, భక్తులు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని ఆ తల్లులను దర్శించుకోవచ్చని తెలియజేశారు. ఈ విధంగా ప్రతి ఆదివారం నాడు జాతరకు ప్రత్యేక బస్సులను భక్తుల కోరిక మేరకు అదనంగా కూడా నడపడం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9490553145 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

# అభిరుచి అలవాటుగా ఉండాలి

**-ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన కలెక్టర్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తమకు సంతోషాన్ని కలిగించే సంతృప్తికరమైన అభిరుచి ప్రతి ఒక్కరికి అలవాటుగా ఉండాలని దాని వల్ల వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం, జిజ్ఞాస పెరగడానికి దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. డిపిఆర్‌సి భవన్‌లో గురువారం జిల్లా తపాలా శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే జిల్లా స్థాయి ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రారంభించారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ రకాల తపాలా స్టాంపులను విద్యార్థులతో కలిసి కలెక్టర్ ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నతనంలో తాను పోస్టల్ స్టాంపులను ఆసక్తితో సేకరించేవాడినని, స్నేహితులతో తపాలా స్టాంపులను మార్చుకుని చాలా పెద్ద కలెక్షన్ పెట్టుకున్నానని గుర్తు చేసుకున్నారు. ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. చిన్న తనంలో కరీంనగర్ జిల్లాకు చెందిన చాలా మంది ఉపాధి అవకాశాల కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లారని అక్కడి నుంచి వచ్చే వారిని స్టాంపులు తీసుకు రావాలని కోరినట్లు కలెక్టర్ తెలిపారు. స్టాంపులు ఒక దేశ చరిత్ర, సంస్కృతి, ప్రకృతి, విజ్ఞానం చూపిస్తుందన్నారు. ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్ పిల్లలకు చాలా ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం జనరేషన్ ఎక్కువగా డిజిటల్ వైపు అడుగులు వేస్తుందని అవుట్ డోర్ యాక్టివిటిస్, స్నేహితులతో బయట ఆడుకోవడం చాలా వరకు తగ్గిపోయిందన్నారు. స్టాంపుల సేకరణ చాలా ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. అనంతరం జిల్లా పోస్టల్ బీమా పాలసీ పరిహార చెక్కులను లబ్ధిదారులకు కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ పర్యవేక్షకులు వీరభద్ర స్వామి, పోస్టాఫీస్ సిబ్బంది, సంబంధిత అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# తొలి రోజు 17 సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్

**-నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన జెడ్పి సిఈవో**








**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రఘునాథపాలెం మండలంలో తొలి రోజు సర్పంచ్ స్థానాలకు 17 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కోయచలకలో గల నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని జెడ్పి సిఈవో దీక్షారైనా, ఎంపిడిఓ అశోక్‌కుమార్ లు సందర్శించారు. ఎన్నికల అధికారులతో మాట్లాడారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి పలు సూచనలు చేశారు. గురువారం ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాగా మండల పరిధిలో 37 గ్రామ పంచాయతీలకు గాను 17 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఎనిమిది మంది వార్డు స్థానాలకు గాను అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. సర్పంచ్ స్థానాలకు చిమ్మపుడిలో ఒకటి, ఈర్లపుడిలో ఒకటి, జికె బంజరలో మూడు, కోటపాడులో ఒకటి, కెవి బంజరలో ఒకటి, మంచుకొండలో ఒకటి, పంగిడిలో ఒకటి, పాపటపల్లిలో ఐదు, రాంక్యాతండాలో ఒకటి, రేగులచలకలో ఒకటి, వి. వెంకటాయపాలెంలో ఒకటి మొత్తం 17 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. చిమ్మపుడిలో బిఆర్‌ఎస్ మద్దతుతో గుత్తా రవి సర్పంచ్‌గా నామినేషన్ దాఖలు చేశారు. రేగులచలకలో బిఆర్‌ఎస్ మద్దతుతో నున్నా లత సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. వి. వెంకటాయపాలెం గ్రామంలో సిపిఐ మద్దతుతో శాఖమూరి శ్రీనివాసరావు సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. పాపటపల్లిలో వి. ద్రాక్షావతి సర్పంచ్ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. అదేవిధంగా పలువురు వార్డు స్థానాలకు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబి జెండా ఎగరాలి

**బిఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కట్టా కృష్ణార్జున్‌రావు**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలో డిసెంబర్11న జరిగే గ్రామపంచాయతీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ జెండా ఎగరాలని ప్రతి కార్యకర్త పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని బిఆర్‌ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జున్‌రావు అన్నారు. గురువారం వైరా మండలం రెబ్బవరం గ్రామంలో వల్లభి శ్రీనివాసరావు నివాసం నందు వైరా మండల అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన వైరా రూరల్ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న కట్టా కృష్ణార్జున్‌రావు మాట్లాడుతూ 22 గ్రామపంచాయతీల్లో ప్రతి పంచాయతీలోను కలిసి వచ్చే పార్టీలతో ముందుకు పోతామని తెలిపారు. మండలంలో బిఆర్‌ఎస్ బలంగా ఉందని పంచాయతీలు పెద్ద ఎత్తున గెలువబోతున్నామని ఆయన తెలిపారు. ప్రతి కార్యకర్త కెసిఆర్ సైనికుల పనిచేసి పార్టీ గెలుపులో కీలక పాత్ర పోషించాలని ఆయన తెలిపారు. ప్రతి కార్యకర్త కెసిఆర్ సైనికుల పనిచేసి పార్టీ గెలుపులో కీలకపాత్ర పోసించాలని ఆయన సూచించారు. అనంతరం గ్రామపంచాయతీలు వారిగా పోటీలు చేసే అభ్యర్థులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు లాల్‌మహ్మద్, నూకల వాసు, మాజీ గ్రంథాలయ డైరెక్టర్ దొంతెబోయిన వెంకటేశ్వర్లు, వైరా పట్టణ అధ్యక్షులు, కార్మిక సంఘ నాయకులు మద్దెల రవి, పారుపల్లి నాగేశ్వరరావు, ముత్తమాల విజయరాజు, కామినేని శ్రీనివాసరావు, మెండెం క్రిష్ణంరాజు, మదార్‌సాహెబ్, పరుచూరి రామారావు, గుజ్జర్లపూడి దేవరాజు, అయినాల కనకరత్నం, ఆకుల రాజు, యరమల రమణారెడ్డి, కిలారి శ్రీనివాసరావు, శెట్టిపల్లి శ్రీనివాసరావు, కందుల ఓంకార్, మడుపల్లి నాగేశ్వరరావు, ఐలూరి శ్రీనివాసరెడ్డి, ఆదాం, నర్సింహారావు, తోటకూర శివయ్య, ఏదునూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో త్వరలో నిర్వహించే సర్పంచుల ఎన్నికలకు అభ్యర్థుల కసరత్తులు ప్రధాన ప్రతిపక్ష పార్టీలు కసరత్తులలో నిమగ్నమై ఉన్నారు. పలు గ్రామాలలో ప్రధాన పార్టీ కాంగ్రెస్‌లో అభ్యర్థులు ఎంపిక కూడా పూర్తయినట్లు సమాచారం. ఒక్కో గ్రామానికి మూడు లేక నాలుగు పేర్లు తయారుచేసి సత్తుపల్లి నియోజకవర్గంలోని అధిష్టానం కు పంపించినట్లు తెలిపారు. డిసెంబర్ మూడో తేదీ లోపు అభ్యర్థుల ఎంపిక పూర్తి కానున్నట్లు స్థానిక నాయకత్వం తెలుపుతుంది .మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీలలో జనరల్ స్థానాలు 12 రిజర్వు కాగా, బిసి 2 ,ఎస్సీలు 7 ,ఎస్టీలు 2, రిజర్వుడ్ అయ్యాయి. జనరల్ స్థానాల్లో ఎన్నికల్లో ఆసక్తిగా పోటీకి ఉండగా , ఎస్ సి, ఎస్ టి, బి సి స్థానాల్లో బరిలో ఉండేందుకు ఆసక్తి లేనట్లు సమాచారం మండల పరిధిలోని లింగాల ,ఎర్ర బోయినపల్లి, పెద్ద కోరుకొండి, చంద్రు పట్ల తెలగవరం, పేరువంచ, వెన్నవల్లి గ్రామాలలో ఎంపిక ప్రక్రియలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక బలం రాజకీయ బలం ప్రజాబలం ఉన్నవారికి ఎంపికలు చేస్తున్నట్లు ఆయా గ్రామాల నాయకులు తెలుపుతున్నారు. ఒక్కో గ్రామానికి నలుగురు చొప్పున పేర్లను తయారుచేసి సత్తుపల్లి నియోజకవర్గంలోని అధిష్టానానికి పంపించి ఎంపికలు పూర్తి చేయడానికి సిద్ధం చేసినట్లు గ్రామాల్లో చర్చలు కొనసాగుతున్నవి. ప్రధాన ప్రతిపక్షమైన బీఆఎస్ సత్తుపల్లి నియోజకవర్గంలో బలంగా ఉన్న గ్రామాల్లో ఎంపిక ప్రక్రియ కూడా రెండు రోజుల్లో సమావేశాలు నిర్వహించి అభ్యర్థి ఎంపికలు పూర్తి చేయనున్నట్లు సమాచారం. వామపక్ష పార్టీలు కూడా రాష్ట్ర జిల్లా నాయకత్వ ఆదేశాలపై ఆధారపడి ఉంటుందని సమాచారం ఎంపికలు ప్రక్రియ డిసెంబర్ మూడో తేదీ లోపు పూర్తవుతుందని ఆయా పార్టీల నాయకులు కార్యకర్తలు తెలుపుతున్నారు.ఏది ఏమైనాప్పటికీ మండలంలో ఎన్నికలు జరిగే గ్రామాలలో ప్రస్తుతం రాజకీయ వేడి ప్రారంభమైంది.

# హైదరాబాద్ తరలిన కాంగ్రెస్ శ్రేణులు



**ప్రజాపక్షం/వైరా:** వైరాలోని కాంగ్రెస్ శ్రేణులు గురువారం డిసిసి నూతన అధ్యక్షుడిగా నూతి సత్యనారాయణకి పదవి ఇవ్వడం పట్ల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులకు కృతజ్ఞలు తెలిపేందుకు కాంగ్రెస్ శ్రేణుల పెద్ద ఎత్తున ర్యాలీతో హైదరాబాద్ తరలిచారు. ఈ కార్ల ర్యాలీని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఏదునూరు సీతారాములు, వైరా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బానోతు బాలాజి నాయక్, ఏఎంసి చైర్మన్ బోళ్ళ గంగారావు, మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, మాజీ కౌన్సిలర్ గుడిపూడి సురేష్, పొదిలి హరినాధ్, పమ్మి అశోక్, లగడపాటి ప్రభాకర్, వీరంశెట్టి సీతారాములు, కొప్పురావూరి సుమంత్, వేముల రత్నాకర్, కొప్పురావూరి సుమంత్, వేల్పుల మురళి, రత్నరాజు, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఖమ్మం జిల్లా ఇంచార్జి గ్రంధి ప్రవీణ్, శ్యామల, బేకరీ నాగేశ్వరరావు, దగ్గుల కాంతారెడ్డి, వైరా నియోజకవర్గ ఆర్యవైశ్య ఇంచార్జి కంపాటి శేషగిరి, తోటకూర శ్రీకాంత్, గుండెల రవి, రాము, పెద్దప్రోలు వెంకన్న, ఉయ్యూరు నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# వైరాలో 22 మంది నామినేషన్



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల తొలిరోజు నామినేషన్ కార్యక్రమంలో 22 మంది సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ దాఖలు చేశారు. వార్డులకు 7గురు నామినేషన్ దాఖలు చేశారు. అష్టగుర్తి 1, గొల్లెనపాడు 2, రెబ్బవరం 1, వల్లాపురం 2, గొల్లపూడి 4, ఖానాపురం 2, కొండకొడిమ 1, సిరిపురం 1, పుణ్యపురం 1, స్టేజిపినపాక 2, ముసలిమడుగు 1, గరికపాడు 2, లింగన్నపాలెం 1, దాచాపురం 1 సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేశారు.

# మండలంలో మొదలైన నామినేషన్ల పర్వం

**- మండలవ్యాప్తంగా నాలుగు నామినేషన్లు**



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా మండలంలో గురువారం నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. జమలాపురం గ్రామపంచాయతీ సర్పంచిగా ఖమ్మం కెఎన్‌ఆర్ గ్రానైట్స్ అధినేత తుళ్లూరు కోటేశ్వరరావు సతీమణి తుళ్లూరు నిర్మలకుమారి రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. మొలుగుమాడు గ్రామపంచాయతీ సర్పంచ్‌గా మండల కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు గంటా తిరుపతమ్మ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. పెగళ్లపాడు గ్రామ సర్పంచ్‌గా ఒక నామినేషన్ దాఖలైందని ఎన్నికల అధికారులు విజయచంద్ర, రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, జిపిఓలు పాల్గొన్నారు.

# సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి : ఎస్సై

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలపై ఎన్నికలు సందర్భంగా ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్సై హరిత తెలిపారు. మండల పరిధిలోని చెన్నూరు, చిన్న కోరుకొండి, చంద్రు పట్ల, పెద్ద కోరుకొండి, తాళ్లూరు వెంకటాపురం ఆయా గ్రామాలు సమస్యాత్మకంగా ఉన్నాయని ఎన్నికల సమయంలో ఈ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రత్యేకమైన అవగాహన కార్యక్రమాలు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసామని ఎస్ఐ పేర్కొన్నారు. ఎలాంటి అల్లర్లు సమస్యాత్మక సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు పోలీస్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఆయా గ్రామాలలో రౌడీషీటర్లు చెన్నూరు, చంద్రుపట్ల, చిన్న కోరుకొండి ,పెద్ద కోరుకొండి గ్రామాలలో ఉన్న రౌడీషీటర్లను బైండోవర్ పై కల్లూరు మేజిస్ట్రేట్ వద్ద ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఓటర్లు గ్రామస్థాయిలో పంచాయతీ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేందుకు సహకరించాలని లేనిచో అల్లర్లు సృష్టిస్తే క్రిమినల్ కేసులు తప్పవని ఎలాంటి వారినైనా వదిలేది లేదని హెచ్చరించారు.

# నేరడ సీపిఐ అభ్యర్థిగా నేతాజీ నామినేషన్



**ప్రజాపక్షం/చింతకాని :** నేరడ గ్రామ సిపిఐ పార్టీ అభ్యర్థిగా దూసరి నేతాజీ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. నేతాజీ కార్యకర్తలతో కలిసి లచ్చగూడెం పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బ్రాహ్మణపల్లి సర్పంచ్ అభ్యర్థిగా ఈది కనకతార నామినేషన్ దాఖలు

**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా సిపిఐ బలపర్చిన మధిర శ్రీనిధి విద్యాసంస్థల అధినేత ఈది అనీల్‌కుమార్ నెహ్రూ సతీమణి ఈది కనకతార స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో నామినేషన్ వేదయం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు పెద్దప్రోలు సైదులు, మాజీ సర్పంచ్ గాదె నరోత్తంరెడ్డి, దామాల బాబు, ఎంపిటిసి కొంగర రామారావు, సొసైటీ ఉపాధ్యక్షులు గంగసాని రాఘవరావు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానికం విచిత్రం..!

**- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ వర్సెస్ కాంగ్రెస్**
**- గిరిజన తెగల మధ్య రగడ**
**- భద్రాచలం సర్పంచ్ సీటుకు యమ డిమాండ్**




**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం ఏజెన్సీలో స్థానిక ఎన్నికల వ్యవహారం చిత్రవిచిత్రమైన పుంతలు తొక్కుతోంది. పంచాయితీ ఎన్నికల్లో ఆదివాసీలకే అవకాశం ఇవ్వాలని, అక్రమంగా గిరిజన హోదా అనుభవిస్తున్న లంబాడీలకు అవకాశం కల్పిస్తే సహించేది లేదని ఆదివాసీ ఐఖ్యకార్యచరణ సమితి తేల్చి చెప్పడంతో భద్రాచలం ఏజెన్సీలో గ్రామ పంచాయితీ ఎన్నికల వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. మరో ప్రక్క లంబాడీలను ఎస్టి జాబితా నుండి తొలగించాలని స్వయంగా స్థానిక ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావు కోర్టులో పిటీషన్ దాఖలు చేయడంతో ఆదివాసీలకు మరింత బలం చేకూరింది. ఇదిలా ఉండగా భద్రాచలం నియోజకవర్గంలో కాంగ్రెస్ రెండు గ్రూపులుగా కొనసాగుతోంది. ఎంఎల్ఏ వెంకట్రావుది ఒకగ్రూపు కాగా అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్యది మరో వర్గం. వీరిద్దరి మధ్య ప్రస్తుతం పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఇప్పుడు స్థానిక ఎన్నికల సందర్భంగా ఎవరి తీరు వారిదే అన్న చందంగా ఉంది. గురువారం నుండి ఈనెల 29వ తేది వరకు తొలివిడత గ్రామపంచాయితీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సాగనుంది. తొలిరోజు ఆయా పార్టీలు బలపరచిన అభ్యర్ధులు నామినేషన్ల వేసేందుకు ఉత్సాహం చూపారు.

### కాంగ్రెస్ వరెస్స్ కాంగ్రెస్...

భద్రాచలం నియోజకవర్గంలో స్థానిక ఎన్నికలు కాంగ్రెస్ వర్సెస్ కాంగ్రెస్ అన్నట్లుగా ఉంది. ఈ ఎన్నికలకు పార్టీ గుర్తులు లేకున్నప్పటికీ ఎవరి వారిని వారు బలంగా బలపర్చుకుంటారు. ప్రధానంగా అంతా కాంగ్రెస్ వర్సెస్ బిఆర్ఎస్ ఉన్నప్పటికీ ఇక్కడి మాత్రం అందుకు భిన్నం. స్థానిక ఎంఎల్ఏ డా.తెల్లం పూనెం కృష్ణ అనే మాజీ వార్డు మెంబర్‌ను సర్పంచ్ అభ్యర్ధిగా ఖరారు చేశారు. ఈ వ్యవహారంలో ఎంఎల్ఏ వర్గం కనీసం పొదెం వీరయ్యను మాటమాత్రానికైనా సంప్రదించ లేదని వార్తలు గుప్పుమంటున్నాయి. దీంతో గుర్రుగా ఉన్న ఆయన భద్రాచలం మొదలుకుని వాజేడు వరకు తన వర్గాన్ని రంగంలోనికి దింపుతున్నట్లు తెలుస్తోంది. ఈనెల 29 వరకు నామినేషన్లు సమర్పించేందుకు అవకాశం ఉండటంతో జాబితా సిద్ధం చేసినట్లు ప్రచారం సాగుతోంది.

### గిరిజన తెగల మధ్య రగడ...

స్థానిక ఎన్నికల తతంగం గిరిజన తెగల మధ్య ఉన్న రగడ మరింత రచ్చకెక్కేలా చేస్తోంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీ, లంబాడీల మధ్య అస్తిత్వ పోరాటం సాగుతోంది. తామే నిజమైన ఆదివాసీలమని, లంబాడీలు దొడ్డిదారిన వచ్చిన తమ ఫలాలను అనుభవిస్తున్నారని ఆదివాసీలు మండిపడుతున్నారు. తాము సైతం గిరిజన తెగకు చెందిన వారిమే అని, ప్రభుత్వ నిబంధనలను అనుసరించే రాష్ట్రంలో జీవనం సాగిస్తున్నామని, తమకు ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ఉందని అంటున్నారు. భద్రాచలం రెవెన్యూ డివిజన్‌లో రాజకీయ పార్టీలు లంబాడీలకు మద్దుతు పలికితే సహించేది లేదని, గిరిజన ప్రజాప్రతినిధులు తెగకు అన్యాయం చేస్తే ఊరుకోబోమని ఆదివాసీలు పెద్ద ఎత్తున పట్టుపడుతున్నారు. మొన్నటి వరకు లంబాడ తెగకు చెందిన హరిచంద్రనాయక్‌ను సర్పంచ్ అభ్యర్ధిగా భరిలో ఉంటారని ప్రచారం సాగింది. కానీ ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. మాజీ సర్పంచ్ భూక్యా స్వేతకు సైతం మరో సారి అవకాశం దక్కుతుందని భావించినప్పటికీ ఆమెను నిరాశ వెంటాడుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బలసాని మాట తీయలేక పొదెం వీరయ్యతో కలిసి పనిచేయడంతో ఆ వర్గంలో అవకాశం దక్కుతుందని స్వేత భావిస్తున్నట్లు వినికిడి. కాగా పొదెం వీరయ్య సైతం ఆదివాసీ తెగకు చెందిన నాయకుడు కావడంతో ప్రస్తుత పరిస్థితులను బేరీజు వేసుకుని స్వేతకు అవకాశం ఇవ్వడం కష్టమనేది తేటతెల్లమవుతోంది. దింతో సర్పంచ్ పదవి కోసం ఆశించి భంగపడ్డ భూక్యా శ్వేత, హరిశ్చంద్ర నాయక్ తో పాటు స్థానిక లంబాడీలంతా ఏకమై భరిలో నిలిచేందుకు చర్చోప చర్చలు సాగిస్తున్నట్లు అత్యంత విశ్వసనీయ సమాచారం.

### యమ డిమాండ్...

భద్రాచలం మేజర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ పదవికి యమ డిమాండ్ ఉంది. గ్రామపంచాయితీల్లో భద్రాచలం మేజర్ గ్రామ పంచాయితీకి వచ్చే ఆదాయం, నిధులు దండిగానే ఉంటాయి. దీంతో ఇక్కడ సర్పంచ్‌గా పనిచేసేందుకు చాలా మంది ఆశావాహులు ఆసక్తి చూపుతుంటారు. డా.తెల్లం వర్గం పూనెం కృష్ణ దొర పేరును ప్రకటించింది. అదే విధంగా బిఆర్ఎస్ సైతం మానే రామకృష్ణను పేరును ఖరాలు చేసింది. తెలగుదేశం పార్టీ సైతం ఇక్కడ బలంగా ఉండటంతో ఆ పార్టీ కూడా దాదాపు అన్ని వార్డుల్లో పోటీ చేసేందుకు సిద్దమైంది. కాంగ్రెస్‌కు సిపిఐ మద్దతు ఇవ్వనుండగా, తెలుగుదేశం పార్టీకి జనసేన, బీజేపీ మద్దతు ఉంది. బిఆర్ఎస్ ఒంటరిగా బరిలో నిలిచే అవకాశం కనిపిస్తోంది. తెగ డిమాండ్ ఉన్న భద్రాచలం సర్పంచ్ స్థానం అనూహ్యంగా ఎవరికి దక్కనుందో అనేది ఈనెల 29న నామినేషన్ల ఉపసంహారణ తర్వాత ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

# స్థానిక సంగ్రామానికి యువ రాజులు 'సై'..!

**-వార్డు సభ్యులు మొదలుకొని జడ్పీటీసీ వరకు పోటీకి సిద్ధం**
**-ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో యువకుల్లో నూతన ఉత్సాహం**




**ప్రజాపక్షం/జూలూరుపాడుః** గ్రామీణ రాజకీయాల్లో కొత్త గాలి వీయనుంది. ఎన్నాళ్లుగానో పెద్దల ఆధిపత్యం కొనసాగుతున్న పంచాయతీ రాజ్ వ్యవస్థలో, ఈసారి జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత తమ ముద్ర వేసేందుకు రెడీ అయినారు. కేవలం పక్కన నిలబడి చూడటం కాదు. నేరుగా బరిలోకి దిగి తమ సత్తా చాటుకోవాలని ఉత్సాహంగా ముందుకొస్తున్నారు. గ్రామ వార్డు సభ్యత్వం నుంచి మొదలుకొని సర్పంచ్, మండల పరిషత్ (ఎంపీటీసీ) జిల్లా పరిషత్ (జడ్పీటీసీ) పదవుల వరకు యువరాజులు పోటీకి సిద్ధమవుతున్నారు.

### పదవి కోసం కాదు.. మార్పు కోసం పోటీ..

గ్రామాలలో పాత పద్ధతులు, పాత విధానాలు, ఒకే తరహా పాలన కొనసాగకుండా, కొత్త ఆలోచనలతో, ఆధునిక వృక్పథంతో, ప్రజలకు చేరువ అయ్యే నాయకత్వం కోసం యువత ముందుకొస్తోంది. ఇప్పటికీ చాలా మంది యువత గ్రామ వీధులలో పాదయాత్రలు చేస్తూ, ప్రజల సమస్యలు వింటూ, చిన్న చిన్న సేవా కార్యక్రమాలతో ప్రజల్లో పట్టు సాధిస్తున్నారు. విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, వ్యవసాయం, ఉపాధి వంటి అంశాలపై చర్చలు మొదలు పెట్టి, ప్రజలకు తమ అభివృద్ధి ప్రణాళికలను వివరిస్తున్నారు. యువ అభ్యర్థులు పుట్టిన రోజులు, జయంతులు, వివాహాలు, శుభకార్యాలు, క్రీడా పోటీలు వంటి ప్రతి సందర్భంలో పాల్గొంటూ ప్రజలతో బంధం పెంచుకుంటున్నారు. ముఖ్యంగా గ్రామంలోని పెద్దలు, మహిళా సంఘాలు, రైతు సమితులు, స్వచ్ఛంద




సంస్థలతో కలసి కూర్చొని, వారి సమస్యలు, అవసరాలు, ఆశలు తెలుసుకుంటున్నారు. "పదవి కోసం కాదు మార్పు కోసం పోటీ" అన్న నినాదంతో ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని రేకెత్తిస్తున్నారు. ఈసారి యువత ఎక్కువ సంఖ్యలో బరిలోకి దిగితే, గ్రామ రాజకీయాల్లో కొత్త నాయకత్వం అవతరించబోతుందని పెద్దలు చెబుతున్నారు. "పాత పద్ధతులను పక్కనపెట్టి, కొత్త ఆలోచనలు, కొత్త ఉత్సాహం, సేవాభావం కలిగిన నాయకులు వస్తే గ్రామాభివృద్ధి వేగం పెరుగుతుంది" అని పెద్దలు అభిప్రాయ పడుతున్నారు.

### సత్తా చాటడమే యువత లక్ష్యం...

మాకు రాజకీయ అనుభవం తక్కువ కావచ్చు కానీ గ్రామం పట్ల ప్రేమ, ప్రజల పట్ల అంకితభావం ఎక్కువ అని చెబుతున్న యువరాజులు, తమ ఊరి ప్రతిష్టను పెంచడం, ప్రజల అవసరాలను తీర్చడం, ప్రతి వర్గం మద్దతు పొందడం తమ లక్ష్యమని స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలో ముందుగానే మైదానంలో దిగిన వారు, పాదయాత్రలతో, ప్రజాభిప్రాయాలు, సామాజిక సేవా కార్యక్రమాలతో చరిత్ర సృష్టించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వెలువడంతో రాజకీయ సమీకరణాలు మారబోతున్నాయి. అభ్యర్థులు తుది నిర్ణయాలు, పూర్తి స్థాయి ప్రచార యంత్రాంగాన్ని సిద్ధం చేసుకుంటున్నారు. గ్రామ వీధుల నుంచి రాజకీయ వేదికల వరకు కొత్త తరంగం ఎగసిపడబోతోందని స్పష్టమవుతోంది. ఈ ఎన్నికల్లో యువత సత్తా చాటితే, భవిష్యత్ పంచాయతీ రాజ్ పాలనతో యువత పాత్ర మరింత బలపడనుంది.

# లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



**ప్రజాపక్షం/ఇల్లందు:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు గురువారం ఇల్లందు జనరల్ మేనేజర్ వి కృష్ణయ్యకు గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం(ఐఎఫ్‌టియు)ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈకార్యక్రమంలో జివిఎల్‌బికేవిఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల శ్రీనివాస్, పోశం బాబు, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కొక్కుసారంగపాణి, ఏరియా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రావూరి ఉపేందర్‌రావు, మోహన్‌రావు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల్లో నాలుగు పంచాయతీలకు బ్రేక్

**ప్రజాపక్షం/ఏన్కూరు :** ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన పంచాయతీ ఎన్నికల షెడ్యూల్లో ఏన్కూరు మండలంలోని నాలుగు గ్రామ పంచాయతీల్లో ఎన్నికలకు బ్రేక్ పడింది. ఏన్కూరు, జన్నారం, నాచారం, ఆరికాయలపాడు గ్రామ పంచాయతీలలో ఎన్నికలకు బ్రేక్ పడింది. ఈ నాలుగు పంచాయతీలపై కోర్టుకు వెళ్లడం వల్ల ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది. మండలంలో మిగిలిన 21 పంచాయతీలకు నోటిఫికేషన్ ఇచ్చారు. దీంతో ఈ పంచాయతీలో స్థానిక సందడి మొదలైంది.

# తృటిలో తప్పిన ప్రమాదం

**- అదుపుతప్పి షాపులోకి దూసుకెళ్ళిన లారీ**



**ప్రజాపక్షం/పాల్వంచ :** ఓలారీ అదుపుతప్పి మరో లారీని ఢీకొట్టి షాపులోకి దూసుకెళ్ళిన సంఘటన గురువారం జరిగింది. కొత్తగూడెం వైపు నుండి పాల్వంచకు వస్తున్న ఓలారీ లారీ అసోసియేషన్ ఫంక్షన్ హాల్ సమీపంలో ముందున్న మరో వాహనాన్ని ఢీకొట్టింది. అదుపు తప్పి షాపులోకి దూసుకెళ్ళింది. దీనితో షాపు ముందున్న రేకులషెడ్ కుప్పకూలింది. నిలిపి ఉన్న ద్విచక్ర వాహనం పైకి వెళ్ళటంతో నుజ్జునుజ్జయింది. అడ్డదిడ్డంగా వస్తున్న లారీని గమనించిన పలువురు తప్పుకోవటంతో ప్రాణాపాయం తప్పింది.

# రైతులకు అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/పాల్వంచ :** మొక్కలకు సకాలంలో పోషకాలను అందించటంతో బలంగా ఎదుగుతాయని ముంబైకి చెందిన ఏరీస్ ఆగ్రో లిమిటెడ్ సిఈఓ నల్లపునేని బాబూరావు సూచించారు. కంపని యాబై సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సంధర్భంగా మండల పరిధి పాండురంగాపురంలో పామాయిల్ రైతులకు గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సంధర్భంగా సిఇఓ మాట్లాడుతూ సరైన సమయంలో సరైన మోదాలో మొక్కలకు కావాలసిన పోషకాలను అందించాలన్నారు. దీనితో పంట దిగుబడి పెరుగుతుందని తెలిపారు. పోషకాల ఆవశ్యకత, తోటల్లో అంతరపంట సాగుపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్రిష్ణమూర్తి, నవీన్‌రెడ్డి, నరసింహారావు, వెంకట్, వెంకన్న, అభిలాష్, జయాకర్, రంగయ్య, ఫెర్టిలైజర్స్ యాజమాని ప్రసాదరావు, రైతులు పాల్గొన్నారు.

# స్థానిక పోరులో సత్తా చాటుదాం





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటేందుకు సిద్ధం కావాలని, సిపిఐ మద్దతు దారులకు ఘన విజయాన్ని అందించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, లక్ష్మి దేవిపల్లి మండల బాధ్యులు చంద్రగిరి శ్రీనివాస రావు అన్నారు. స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్లో గురువారం జరిగిన లక్ష్మీ దేవిపల్లి మండల గ్రామపంచాయితీ బాధ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల పరిధిలోని గ్రామాలకు కావాల్సిన మౌళిక వసతులు, అభివృద్ధిపై ప్రతేయ్క దృష్టి సారించి ఇప్పటికే 80 శాతం మేర ప నులు పూర్తి చేశామని, మరికొన్ని పనులు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. ఈ అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయంవైపు పయణించాలని సూచించారు. ప్రజలకు సేవలందించే అభ్యర్ధులను ఎంపిక చేసి మద్దతు తెలపాలని, ప్రచార కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో లక్ష్మి దేవిపల్లి మండల కార్యదర్శి ధీటి లక్ష్మి పతి, జిల్లా సమితి సభ్యులు కె రత్నకుమారి, గుత్తుల సత్యనారాయణ, దారా శ్రీనివాస్ లక్ష్మారెడ్డి, మంద నిర్మల, నూనావత్ గోవింద్, సపావట్ రవి, బానోత్ నెహ్రూ, జర్పుల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు గోవిందాపురం ఇండిపెండెంట్ సర్పంచ్ అభ్యర్ధిగా ఓర్సు కోటేశ్వరి నామినేషన్

**ప్రజాపక్షం/వైరాః** వైరా మండలం గోవిందాపురం గ్రామంలో ఇండిపెండెంట్ అభ్యర్ధిగా ఓర్సు వెంకటకృష్ణ భార్య ఓర్సు కోటేశ్వరి రేపు నామినేషన్ వేయనున్నారు. రాజకీయాలు కచ్చితంగా ఏ పార్టీకి లేకుండా స్వతంత్ర అభ్యర్ధిగా బరిలో దిగుతున్నామని ఓర్సు వెంకటకృష్ణ, కోటేశ్వరి దంపతులు తెలిపారు. గ్రామంలో ప్రజలతో సంబంధాలు సామాజిక సమీకరణాలతో పాటు రాజకీయాకు అతీతంగా ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని ఆశీర్వదించి గోవిందాపురం సర్పంచ్‌గా సేవలించేందుకు గ్రామ ప్రజలు దీవించాలని ఓర్సు వెంకటకృష్ణ, కోటేశ్వరి దంపతులకు కోరారు.

# పోటు ప్రసాద్ ఆశయాలను సాధించాలి

**ప్రజాపక్షం/పాల్వంచ :** తుదిశ్వాస వరకు పార్టీ విస్తరణకు కృషి చేసి, పేద వర్గాలను పోరాటాల వైపు నడిపించిన పోటు ప్రసాద్ ఆశయ సాధ కోసం పాటుపడాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వ నాథం పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు, ఖమ్మం జిల్లా మాజీ కార్యదర్శి పోటు ప్రసాద్ ప్రథమ వర్ధంతి వేడుకలను సిపిఐ కార్యాలయం చంద్రా రాజేశ్వరరావు భవన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి నాయకుడిగా, కార్మిక సంఘం నేతగా పేద ప్రజలను మమేకం చేసి పోరాటాలవైపు నడిపించిన వ్యక్తి పోటు ప్రసాద్ అని ఆయన సేవలను కొనియాడారు. తుశ్వాస వరకు పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేసిన నేతల త్యాగాలను, సేవలను నేటి తరం ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. పేదవర్గాల సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. స్వార్థ ప్రయోజనాల కోసం జెండాలు, అజెండాలు మారుస్తూ రాజకీయాలను కలుషితం చేస్తూన్న ప్రస్తుత తరుణంలో అందుకు భిన్నంగా నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి కడదాకా ఒకే జెండా ఎర్రజెండాతో మమేకమైన నికార్సయిన కమ్యూనిస్టు అలుపెరగని పోరాటయోధుడు పోటు ప్రసాద్ అన్నారు. ప్రసాద్ మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటన్నారు. ప్రసాద్ ఆశయాలను సాధించిన నాడే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు అన్నారపు వెంకటేశ్వర్లు, వరక అజిత్, నాయకులు డి. చెన్నయ్య, వైఎస్ గిరి, అనుముల సాయి, దామిరెడ్డి క్రాంతి, ఇరుకు రామారావు, సంజీవరావు, రామాచారి, ఆది నారాయణ, అశోక్, రామారావు, కోమటి శ్రీను, అల్లి వెంకటేశ్వర్లు, సత్యనారాయన, లాల్ పాషా తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక కోలాహలం..!

**- తోలిరోజు నామినేషన్ల హడావిడి**
**- సర్పంచ్-82, వార్డు మెంబర్స్‌గా 87 దాఖలు**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో స్థానిక ఎన్నికల కోలాహలం మొదలైంది. మూడు విడతల్లో జరగనున్న ఈ ఎన్నికలకు తొలి విడతలో భాగంగా గురువారం మంచి రోజు కావడంతో ప్రధాన పార్టీలు బలపరిచిన అభ్యర్థులు వారివారి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. జిల్లాలో ఏర్పాటు చేసిన నామినేషన్ పత్రాల స్వీకరణ కేంద్రాల వద్ద అభ్యర్థులు పోటీలు పడీ మరీ మందీ మర్బాలంతో చేరుకుని నామినేషన్లు వేశారు. జిల్లా వ్యాప్తంగా తొలివిడతలోని ఎనిమిది మండలాల పరిధిలో 159 సర్పంచ్ స్థానాలకు గానూ 82 మంది నామినేషన్ పత్రాలు సమర్పించారు. అదే విధంగా 1436 వార్డు మెంబర్ స్థానాలకు గానూ 87 మంది వారివారి నామినేషన్ పత్రాలు సమర్పించారు. నామినేషన్లు వేసేందుకు ఈనెల 29వ తేది సాయంత్రం 5 గం.ల వరకు సమయం ఉండటంతో భారీగా నామినేషన్ పత్రాలు దాఖలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా నామినేషన్ సమయంలో ఆయా అభ్యర్థులను బలపరుస్తున్న రాజకీయ పార్టీలు సందడి చేశాయి. ఇక గెలుపు తమదే అన్న రీతిలో వారి తీరు సాగింది.





# బాల్య వివాహాలను నిర్మూలించాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో ఒక్క బాల్య వివాహం కూడా జరగకుండా నిర్మూలించాలని జిల్లా బాలల సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ గుంటుపల్లి భారతిరాణి పిలుపు నిచ్చారు. జాతీయ బాల్య వివాహ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ (ఎయిడ్) సంస్థ, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం గాంధీచౌక్‌లోని బాలికల జూనియర్ కళాశాలలో 100 రోజుల బాల్య వివాహ నిరోధక కార్యచరణ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన భారతి రాణి మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన అనేది ప్రజల భాగస్వామ్యంతో జరుగుతుందన్నారు. బాలికలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆ తర్వాతే వివాహం గురించి ఆలోచించాలని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి వెల్పుల విజేత మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమం ద్వారా ఆడపిల్లల యొక్క విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాల పట్ల నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బాలల సమస్యల పరిష్కారానికి చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు కాల్ చేసి తెలపాలన్నా రు. జిల్లా విద్యాశాఖాధికారి చైతన్య జైని మాట్లాడుతూ ఆడ పిల్లలు కౌమర దశలో వచ్చే మార్పుల పట్ల ఆందోళన చెందకుండా ఉండాలన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవి బాబు మాట్లాడుతూ బాల బాలికలు మత్తు పదార్థాలు, సామాజిక మాధ్యమాలు, చరవాణి వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎయిడ్ సంస్థ డైరెక్టర్ వాణి హరి ప్రసాదరావు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా మూడేళ్లుగా బాల్య వివాహాల నిర్మూలనపై, లైంగిక దాడులపై , బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణాపై క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రంగవల్లుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. బాల్య వివాహాల నిర్మూలనకు సంబంధించి ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో షీ టీం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సైబర్ సెల్ బాధ్యులు ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, డా॥ బిందుశ్రీ, శారద, దుర్గ, సుబ్రహ్మణ్యం, ఉమెన్ హబ్ బాధ్యులు సమ్రిన్, నరేష్, భాస్కర్, రాందాస్, రవీందర్, రవిచంద్ర, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.




# తనను గెలిపిస్తే ఐదేళ్ల పాటు ఊరిని అభివృద్ధి చేస్తా

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తనను సర్పంచ్ గా గెలిపిస్తే... వీరన్న స్వామి దేవాలయం కు ఎకరం పొలం విరాళంగా ఇస్తానని మోటాపురం సొసైటీ మాజీ డైరెక్టర్ రావెళ్ల కృష్ణారావు పేర్కొన్నారు. బుధవారం తన మేనిఫెస్టో ను విడుదల చేశారు. తనను గెలిపిస్తే ఐదేళ్ల పాటు ఊరందరి ఇంటి, నీటి పన్నులు తానే చెల్లిస్తానని అన్నారు. ప్రతీ నెలా ఉచిత వైద్య శిబిరాలు, ఉచిత మందులు, గ్రామం లో ఉన్న ప్రతీ దేవాలయం కు రూ.50 వేల ను. ఉత్సవాల కోసం అందిస్తానని అన్నారు. పాఠశాల విద్యార్థులకు పోటీల కు బహుమతులు అందిస్తానన్నారు. బాగా చదివే విద్యార్థులకు సైకిళ్లు ఉచితంగా అందిస్తాన్నారు. పండుగలకు ముగ్గుల పోటీలుఅందించనున్నట్లు పేర్కొన్నారు. అయ్యప్ప మాలధారణ భక్తులకు నిత్య అన్నదానం, ప్రతీ దసరా కు 100 మందికి వస్త్రలు పంపిణీ, 10 మంది పేద మహిళలకు కుట్టు మిషన్ ఉచితంగా అందిస్తానని అన్నారు. సొంత ఖర్చులతో వాటర్ ప్లాంట్ ద్వారా ఇంటింటికి ఉచిత మినరల్ వాటర్ సరఫరా చేస్తానని అన్నారు. పెళ్లిలు, జాతరలకు అవసరమైన డీజే; మైక్ లను అందిస్తామని అన్నారు. అదే విధంగా మరణించిన వారికి ఫ్రీజర్‌ను ఉచితంగా అందిస్తామన్నారు. స్మశానాని వైకుంఠ రథం ఏర్పాటు చేస్తాన్నారు. పేద కుటుంబాలలో ఆడపిల్ల వివాహానికి చీర, సాకే కానుక..వికలాంగులకు ఉచిత ట్రై సైకిళ్లు అందించనున్నట్లు తెలిపారు. తమను సర్పంచ్ గా గెలిపిస్తే మేనిఫస్టో ను అమలు చేస్తానని మేనిఫస్టో ను సోషల్ మీడియా లో వైరల్ కావటంతో చర్చంశనీయంగా మారింది.



# వైజ్ఞానానికి తొలిమెట్టు సైన్స్ ఫెయిర్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధికి బాల విద్యా వైజ్ఞానానికి సైన్స్ ఫెయిర్ వేదికలు తొలి మొట్టు అని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక సెయింట్ మేరీస్ స్కూల్లో 53వ జాతీయ సైన్స్ ఫెయిర్ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిధిగా హాజరైన ఆయన మాట్లాడారు. విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. సైన్స్ ఫెయిర్ ద్వారా అవగాహన చేసుకున్న అంశాలపై నిత్యం మననం చేసుకుంటే భవిష్యత్‌లో ఉపయోగపడతాయని చెప్పారు. శాస్త్రవేత్తల కృషి పట్టుదల వల్ల నేడు దేశంలో శాస్త్ర సాంకేతికంగా ముందుకు సాగుతుందన్నారు. ప్రతీ విద్యార్థి మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ జీవితాన్ని చదవాలని చెప్పారు. అనంతరం జిల్లా విద్యాధికారి బి నాగలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల జ్ఞాన సంపత్తిని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గనగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులను అందజేశారు. అదే విధంగా పర్యావరణ పరిక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, అప్రమత్తంగా లేకుంటే జరిగే నష్టాలపై నైనిక ఇచ్చిన సందేశాన్ని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.



# సమాచార హక్కు చట్టంతో పారదర్శక పాలన

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సమాచార హక్కు చట్టంతో పారదర్శక పాలన సాధ్యమవుతుందని ఆ చట్టం కమీషనర్ బోరెడ్డి అయోధ్యా రెడ్డి అన్నారు. గురువారం సమాచార హక్కు చట్టంపై వచ్చిన అప్పీళ్లను పరిశీలించారు. అనంతరం ఐడిఓసిలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాళ్ శ్రేష్ఠ. అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయోధ్యారెడ్డి మాట్లాడుతూ సమాచారహక్కు చట్టం ప్రజాస్వామ్యానికి శక్తినిచ్చే కీలక సాధనం అన్నారు. చట్టం నిబంధనలపై ప్రతీ అధికారికి పూర్తి అవగాహన ఉండాలన్నారు. ప్రజలు కోరిన సమాచారాన్ని అందించాలని, తద్వారా నమ్మకం కలుగుతుందన్నారు. అనంతరం భద్రాచలం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ అందిన దరఖాస్తులకు సరైన సమయంలో సమాచారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, పౌర సమాచార అధికారులు, సహాయ పౌర సమాచార అధికారులు పాల్గొన్నారు.



# మేడారంకు ప్రత్యేక బస్సు

**-ఆర్టీసి రీజినల్ మేనేజర్ సరిరామ్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్దదైన సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లు భక్తుల కొరకు ఖమ్మం నూతన బస్టాండ్ నుంచి ప్రతి ఆదివారం మేడారంకు ప్రత్యేక బస్సు సర్వీస్ నడపనున్నట్లు ఆర్టీసి రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ గురువారం తెలిపారు. 2026 జనవరి 28 నుంచి 31 వరకు మేడారంలో సమ్మక్క సారలమ్మ జాతర జరగనుందని ముందస్తుగా టిజిఎస్ ఆర్టీసి ఖమ్మం డిపో నుంచి ప్రతి ఆదివారం ఎక్స్‌ప్రెస్ బస్సు ఖమ్మం నూతన బస్టాండ్ నుంచి బయలు దేరుతుందని ఆర్‌ఎం తెలిపారు. ఈనెల 30 నుంచి జనవరి 31 వరకు ప్రత్యేక బస్ సర్వీసు ఉంటుందని తెలిపారు. ఖమ్మం డిపో నుంచి ప్రతి ఆదివారం ఉదయం ఆరు గంటలకు బస్సు బయలు దేరుతుందని తిరిగి మేడారం నుండి సాయంత్రం 5.30కు బయలు దేరుతుందని తెలిపారు. ఖమ్మం నుంచి మేడారంకు ఛార్జీ పెద్దలకు రూ. 230, పిల్లలకు రూ.120, ఇల్లందు నుంచి మేడారంకు పెద్దలకు రూ. 170, పిల్లలకు రూ.90 ఉంటుందని ఆర్‌ఎం తెలిపారు. భక్తులు ఇట్టి సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌ఎం కోరారు.



# విద్యార్థులకు ఇంగ్లీష్ లిఖిత ఉపన్యాస పోటీలు

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు హైస్కూల్ నందు ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు టి. లక్ష్మి నరసయ్య అధ్యక్షతన ఇంగ్లీష్ భాష యొక్క పరిజ్ఞానాన్ని అభివృద్ధి పరచాలని ఉద్దేశంతో మండల స్థాయి ఇంగ్లీష్ టీచర్స్ అసోసియేషన్ వారు విద్యార్థిని విద్యార్థులకు లిఖిత, ఉపన్యాస పోటీలు గురువారం నిర్వహించారు. ఇంగ్లీష్ లిఖిత పోటీల్లో సీనియర్ విభాగంలో ప్రథమ స్థానం రోహిత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాకర్ల జూనియర్, లిఖిత విభాగంలో నంద్రు విశ్వ సన్నిద్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జూలూరుపాడు, ఇంగ్లీష్ స్పీచ్ సీనియర్ విభాగంలో బి ప్రసన్న జడ్పీహెచ్ఎస్ పాపకొల్లు, జూనియర్ ఇంగ్లీష్ స్పీచ్ విభాగంలలో ఎం బిందు శ్రీ జడ్పీహెచ్ఎస్ కాకర్ల మొదటి బహుమతి సాధించడం జరిగినది. మండల స్థాయిలో సీనియర్ మరియు జూనియర్ విభాగాలలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులు మాత్రమే జిల్లా స్థాయికి అర్హత సాధిస్తారు అని మండల ఇంగ్లీష్ భాష టీచర్స్ అసోసియేషన్ కన్వీనర్ కాల్వ రవికుమార్ ఎస్సే ఇంగ్లీష్, కో కన్వీనర్ నంద్రు గురుమూర్తి ఎస్సే ఇంగ్లీష్ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల నుండి ఇంగ్లీష్ సబ్జెక్ట్ ని బోధిస్తున్నటువంటి ఉపాధ్యాయులు ఎస్.కె కాజా మియా, టి సాల్మన్ రాజ్, సీతారామరాజు, బి సునీత, డి శంకర్, భవాని, అదేవిధంగా స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు సీనియర్ సహో ఉపాధ్యాయులు రామిశెట్టి శ్రీనివాసరావు నిమ్మగడ్డ ఉమా, పి.ఉమామహేశ్వరి, వి శకుంతల, బోడ కృష్ణ, పి రామనాథం, జి వెంకటేశ్వర్లు, సర్దార్ పటేల్, బానోత్ అరుణ కుమారి పాల్గొన్నారు.

